మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 28 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



## కవిత మధ్యంతర బెయిల్ పటిషన్

### విచారణ నాలుగో తేదీకి వాయిదా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన భారాస ఎమ్మెల్సీ కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్ పై విచారణ ఏప్రిల్ 4కు వాయిదా పడింది. తన కుమారుడి పరీక్షల దృష్ట్యా ఈ నెల 16 వరకు బెయిల్ మంజూరు చేయాలని మార్చి 26న ఆమె రౌస్ అవెన్యూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కవిత పిటిషన్‌పై సమాధానం చెప్పాలని న్యాయస్థానం మిగతా 2లో..

## ముమ్మరంగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు

### రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ4 గా ఉన్న మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే భవ్య సిమెంట్ ఓనర్ ఆనంద్ ప్రసాద్ నుంచి రూ. 70 లక్షలు సీజ్ చేశామని రాధాకిషన్ రావు వెల్లడించారు. అటు దుబ్బాక ఎన్నికల సమయంలో రఘునందన్ రావు, ఆయన బంధువుల నుంచి రూ. కోటి సీజ్ చేశామని ఆయన తెలిపారు. ఇక మునుగోడు బై పోల్ సమయంలో కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి అనుచరుల వద్ద రూ. 3.50 కోట్లు సీజ్ చేసినట్లు రాధాకిషన్ రావు స్టేట్మెంట్ ఇచ్చారు. ప్రణీత్‌రావు సమాచారం ఇవ్వడంతోనే నగదు సీజ్ చేసినట్లు రాధాకిషన్ రావు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

## కేజ్రీవాల్‌కు 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధింపు

### లిక్కర్ కేసులో తీహార్ జైలుకు తరలింపు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కస్టడీని కోర్టు మరోసారి పొడిగించింది. ఈ కేసులో 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు సోమవారం ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆయనను తిహార్ జైలుకు తరలించారు. ఈ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టులో హాజరుపర్చగా.. తొలుత ఏడు రోజులు, ఆ తర్వాత నాలుగు రోజుల పాటు ఈడీ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. సోమవారంతో ఆ కస్టడీ ముగియడంతో కేజ్రీని సోమవారం కోర్టు ఎదుట హాజరుపర్చారు. ఈ సందర్భంగా దర్యాప్తు సంస్థ తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు.. ఈడీ కస్టడీ మిగతా 2లో..

# ఖరారు కానున్న 4 కాంగ్రెస్ ఎంపి సీట్లు..

- ఢిల్లీ చేరుకున్న రేవంత్,భట్టి విక్రమార్క
- ఖమ్మంపై పలువురి నేతల పట్టు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించాల్సిన నాలుగు ఎంపి స్థానాలు కాకరేపుతున్న వేళ సిఎం రేవంత్, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు ఢిల్లీ చేరుకున్నారు. సీట్లపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేయనుంది. ఇకపోతే ఖమ్మం సీటులో పోటీ ఎక్కువగా ఉంది. ఇక్కడ మాకు కావల్సిందంటే.. మాకు కావాల్సిందేనంటూ బడా నేతలు పట్టుబడుతున్నాయి. ఈ క్రమంలోనే సందట్లో సడేమియాలాగా కొత్త వ్యక్తులు రంగంలోకి దిగుతున్నారు. తెలంగాణలో మిగిలిన 4 స్థానాలపై కాంగ్రెస్ కసరత్తు నిర్వహిస్తోంది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటి సాయంత్రం భేటీ కానుంది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల్లో అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేయనుంది. ఇప్పటికే మిగతా13 స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ నాయకత్వం ఖరారు చేసింది. ఖమ్మం సీటు కోసం ముగ్గురు మంత్రుల కుటుంబాలు పోటీ పడుతున్నాయి. పోటీ పడుతున్న వారిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబం నుంచి తుమ్మల యుగంధర్ ఉన్నారు. ఈ ముగ్గురిని కాదని కాంగ్రెస్ నేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కొత్తగా తెరపైకి వచ్చారు. మంత్రుల కుటుంబాలను కాదని వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కు టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. వరంగల్ స్థానం కోసం జరుగుతున్న సుదీర్ఘ కసరత్తు నిర్వహించనుంది. డి. సాంబయ్య, డా. పరమేశ్వర్, సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ సహా పలువురు నేతలు టికెట్ ఆశిస్తున్నారు. తాజాగా కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కడియం చేరిక నేపథ్యంలో వరంగల్ సీటుపై ఆసక్తి పెరిగింది. మాదిగ వర్గానికి ఈ సీటు ఇవ్వాలని మాదిగ జేఏసీ డిమాండ్ చేస్తోంది. కడియం కుటుంబాన్ని మాదిగ వర్గంగా పరిగణించకూడదని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ మిగతా 2లో..

## నిరుద్యోగులకు భారంగా టెట్ ఫీజులు

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): టెట్ ఫీజుల పెంపుపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం తగదని హితవుపలికారు. సీటెట్‌తో పోల్చితే టెట్ ఫీజులు రెట్టింపు ఉన్నాయని విమర్శించారు. అధిక ఫీజులకు నిరసనగా బీఈడీ, డీఈడీ వాళ్లు పోరాడుతున్నా, అభ్యర్థులు రోడ్లెక్కి ఉద్యమిస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?.. మిగతా 3లో..

## ఇరిగేషన్ రంగాన్ని సర్వనాశనం చేసిన కెసిఆర్

### పంటల బీమా అమలు చేయని ఏకైక రాష్ట్రం తెలంగాణ

### అబద్దాలతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లిన కెసిఆర్

### కరువు వచ్చిందే బిఆర్ఎస్ పాలనలోనే అన్న ఉత్తమ్



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): కెసిఆర్ హయాంలో ఇరిగేషన్ రంగం సర్వనాశనం అయ్యిందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ రంగంలో కేసీఆర్ చేసిన దోపిడీ దేశంలో ఎవరూ చేయలేదన్నారు. జనగామ, సూర్యపేట జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్ ఇచ్చారు. నిన్న కేసీఆర్ అన్ని అబద్దాలే మాట్లాడారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ హయాంలో తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందన్నారు. పోలీస్ శాఖను ఎక్కువ మిస్ యూజ్ చేసింది కేసీఆరే అని విమర్శించారు. పోలీసులు న్యూట్రల్‌గా ఉండాలని ఇప్పుడు కేసీఆర్ చెప్పడం హాస్యాస్ప దమన్నారు. కరువు వచ్చింది బీఆర్ఎస్ పాలనలోనే అని... దాన్ని సమర్థవంతంగా డీల్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రైతులకు పంట బీమా కల్పించలేదని.. .దేశంలో పంట బీమా కల్పించని ఏకైక సర్కార్ బీఆర్ఎస్ దేనని విమర్శించారు. వరదలు, కరువుతో పంట నష్టపోతే.. ఒకటి రెండు చోట్లకు వెళ్లి కేసీఆర్ డ్రామా చేశాడని.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. మైక్ పనిచేయకుంటే కరెంట్ పోయిందంటూ కేసీఆర్ అబద్దాలు మాట్లాడారని.. పవర్ విషయంలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. 24 గంటల పవర్ పాలసీని కొనసాగిస్తున్నాం.. రాష్ట్రంలో పవర్ కట్స్ లేవని స్పష్టం చేశారు.కాళేశ్వరం గురించి మాట్లాడటానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి. తలదించుకోవాలి.. ముందు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాళేశ్వరంలో కమిషన్ల కోసం అంచనాలు పెంచారని చెప్పారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పిందే మిగతా 2లో..


## కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు

- పదేళ్లు సిఎంగా చేసిన వ్యక్తి చేసే వ్యాఖ్యలేనా
- రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఎలా మాట్లాడుతారు
- అప్పులకుప్పగా మార్చి అభివృద్ధి అంటే నమ్మాలా
- యాదాద్రి పవర్ ప్లాంట్ అంగీకారం కాకున్నా నిర్మాణమా
- కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): పదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన కెసిఆర్ అర్థంపర్థం లేకుండా దిగజారి మాట్లా డుతున్నారని సూర్యాపేటలో భారాస అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శలు చేశారు. భారాస నేతలు భారీగా కాంగ్రెస్‌లో చేరుతుంటే ఆయన తట్టుకోలే పోతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటల్లో కొంచెమైనా వాస్తవాలు లేవన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. పదేళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఇంతలా దిగజారుతారా?అని ప్రశ్నించారు. కట్టుకథలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని మిగతా 2లో..

## ప్రజా నాడి




## తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

### నిప్పల కుంపటిగా మారడంలో బెంబేలు - మరో రెండుమూడు రోజులు ఇదే పరిస్థితి



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కొరసాగుతోంది. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో జనం బెంబేలెత్తుతున్నారు.ఉదయం 12 గంటలు దాటితే ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. మరో మూడు రోజులు రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు అంటున్నారు. రాగల మూడు రోజులు సాదారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరిం చారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో అత్యధి క ఉష్ణోగ్రతులు నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.రాష్ట్రంలో ఎండలు తీవ్రమవు తున్నాయి. ఉదయం నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. దక్షిణ తెలంగాణలో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. రాష్ట్రంలో ఎండలు తీవ్రమై గాలిలో తేమతగ్గిందని వాతావరణ కేంద్రం తెలిపింది. గాలిలో తేమ శాతం తగ్గడంతో పొడిగాలులు వీస్తున్నాయని వివరించింది. ఈ నెలలో ఎండలు అధికంగానే ఉంటాయని, తెలిపింది.

## మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు వాయిదా

### సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలుతో ఈసీ నిర్ణయం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపును వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్ సోమవారం ఆదేశించింది. కాగా మార్చి 28న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. మంగళవారం కౌంటింగ్ జరగాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మిగతా 2లో..

## బిజెపి మతోన్మాదాన్ని అడ్డుకోవడమే లక్ష్యం

### అందుకే కాంగ్రెస్‌లో చేరామన్న కడియం



హనుమకొండ, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు): భాజపా మతోన్మాదాన్ని అడ్డుకోవడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లౌకికవాదాన్ని నిలబెట్టుకోవాలనే ఆ పార్టీలో చేరినట్లు చెప్పారు. తన కుమార్తె కావ్యతో కలిసి హనుమకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఆయన కలిశారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ.. తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అధికార పార్టీలో చేరినట్లు కడియం తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మరోసారి మోసం చేసేందుకే భారాస అధినేత కేసీఆర్ వస్తున్నారని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## నిరుద్యోగులకు భారంగా టెట్ ఫీజులు

ఇదేనా మీ సోకాల్డ్ ప్రజా పాలన? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. 'టెట్ ఫీజులు భారీగా పెంచడం వల్ల నిరుద్యోగులకు నష్టం కలుగుతున్నది. ఎస్సీ, ఎస్టీ దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే రాయితీని ప్రభుత్వం విస్మరించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం బాధాకరం. దీన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో ఒక పేపర్, రెండు పేపర్లు రాసినా రూ.400 మాత్రమే ఫీజు ఉండేది. ప్రస్తుతం ఒక పేపర్‌కు రూ.వెయ్యి, రెండు పేపర్లకు రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. సీబీఎస్సీ నిర్వహించే సీటెట్‌తో పోల్చితే డబుల్‌గా ఉండటం గమనార్హం.రిజర్వ్‌డ్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించకుండా, జనరల్ కేటగిరీ విద్యార్థులతో సమానంగా ఫీజు అమలు రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం. సీటెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు సీబీఎస్ఈ ఫీజు రాయితీ అమలు చేస్తున్నది. మన రాష్ట్రంలో ఏపీసెట్, ఐసెట్ ప్రవేశ పరీక్షల్లోనూ ఫీజుల రాయితీ అమలు చేస్తున్నారు. టెట్‌లో మాత్రం తెలంగాణ ప్రభుత్వం రాయితీ ఇవ్వడం లేదు. ఫీజు రాయితీ కల్పించకపోవడాన్ని నిరసిస్తూ బీఈడీ, డీఎడ్ అభ్యర్థులు పోరాడుతున్నారు. పుస్తకాలు వదిలి రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం.. ఇదేనా మీ సోకాల్డ్ ప్రజా పాలన' అని లేఖలో పేర్కొన్నారు.

## ఇరిగేషన్ రంగాన్ని సర్వనాశనం చేసిన కెసిఆర్

కేసీఆర్ అని నిప్పులు చెరిగారు. కేసీఆర్, జగన్ దోస్తీతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. కృష్ణా నుంచి జగన్ అక్రమంగా నీళ్లను తరలిస్తున్నా కేసీఆర్ నోరు మెదపలేదని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే ఏపీకి ఎక్కువ నీళ్లు తరలి వెళ్లాయన్నారు. కేసీఆర్ భయాందోళనలో ఉన్నాడు.. అందుకే పొలం బాట పట్టారని చెప్పారు. కేసీఆర్ పొంకనాలకు పోయి పార్టీని నాశనం చేశాడని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లలోనే కుప్పకూలిందని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగవుతుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇన్ని మాటలు మాట్లాడుతున్న కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు పంట బీమా ఎందుకు కల్పించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగారు. దేశంలో పంట బీమా కల్పించని ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్సేనని ధ్వజమెత్తారు. పార్లమెంటు ఎన్నికల తరువాత బిఆర్ఎస్ కనుమరుగుకావడం ఖాయమని జోస్యం చెప్పారు. 24 గంటల పవర్ పాలసీ కొనసాగిస్తున్నామని, నిమిషం పవర్ కట్స్ ఎక్కడా లేవన్నారు. తెలంగాణ రైతాంగం, ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసి వ్యక్తి కెసిఆర్ అని, అందుకు ఆయన సిగ్గుపడాలి, తలదించుకోవాలి, తెలంగాణ జనాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ రంగాన్ని కెసిఆర్ నాశనం చేయడంతో పాటు దోపిడీ చేశారని ఆరోపణలు చేశారు. కాళేశ్వరం గురించి మాట్లాడేందుకు కెసిఆర్‌కు సిగ్గుండాలని, కాళేశ్వరంలో కమీషన్ల కోసం అంచనాలు పెంచారని, కళ్ల ముందే కాళేశ్వరం కుంగినా మాట్లాడటం మూర్ఖత్వం కిందకు వస్తుందని ఉత్తమ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరన్నారు. పదేండ్లలో పంట నష్టం జరిగితే కేసీఆర్ రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఇరిగేషన్‌పై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెప్తామని బీఆర్ఎస్ చీఫ్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ – జగన్ కలిసి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలపై కుట్ర చేశారని ఆరోపించారు.

### మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు వాయిదా

జూన్ 2న కౌంటింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ పేర్కొంది. కాగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణ రెడ్డి రాజీనామా చేసి కల్వకుర్తి అసెంబ్లీ బరిలో నిలిచి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్ కుమార్ రెడ్డి ఎమ్మెల్సీ బరిలో నిలిచారు. మంగళవారం(ఏప్రిల్ 2) తాడో పేడో తేల్చుకుందాం అని ఎదురుచూసిన ఇరు అభ్యర్థులకు నిరాశ మిగిలింది. విజయం ఎవరిది అని తేలాలంటే మరో రెండు నెలలు ఆగాల్సిందే.

## కవిత మధ్యంతర బెయిల్ పటిషన్

ఈడీకి నోటీసులు జారీ చేస్తూ.. విచారణను వాయిదా వేసింది. గత నెల 15న హైదరాబాద్‌లోని తన నివాసంలో కవితను ఈడీ అరెస్టు చేసి మరుసటి రోజు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచిన సంగతి తెలిసిందే. ముందుగా ఈడీ 10 రోజుల కస్టడీకి కోరగా.. న్యాయస్థానం ఏడు రోజులకు అనుమతి ఇచ్చింది. అనంతరం మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరగా.. మూడు రోజులకు అనుమతించింది. ఈడీ కస్టడీ మార్చి 26న ముగియడంతో.. అదే రోజు కోర్టులో దర్యాప్తు సంస్థ అధికారులు ఆమెను హాజరు పరిచారు. ఆ తర్వాత కవితకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో తిహాడ్ జైలుకు తరలించారు. కవిత తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. తన కుమారుడికి పరీక్షలు ఉండటంతో బెయిల్ ఇవ్వాలంటూ కోర్టుకెళ్లారు కవిత. ఏప్రిల్ 16వ తేదీ వరకు బెయిల్ కావాలంటూ పిటిషన్ వేశారు. తీహార్ జైలులో ఉన్న కవితకు 14రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ మార్చి 26 న కోర్టు ఆదేశాలిచ్చింది. లిక్కర్ కేసులో కవిత పేరు లేకున్నా అరెస్ట్ చేశారన్నారు ఆమె తరపు లాయర్. అరుణ్ పిళ్ళై స్టేట్మెంట్ లోని అంశాలను కోర్టులో ప్రస్తావించారు. 9 స్టేట్మెంట్ లు ఒకరకంగా ఉంటే.. పదో రిప్లే పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. 18నెలల ముందు దాఖలు చేసిన చార్జ్ షీటులో నిందితురాలిగా కవిత పేరు లేదన్నారు సింఘ్వీ. ఈడీ విచారణకు సహకరించినా కవితను అరెస్ట్ చేశారని కోర్టుకు తెలిపారు. కవితకు వ్యతిరేకంగా బుచ్చిబాబు స్టేట్మెంట్ ఫస్ట్ లో ఉన్నా.. ఆ తర్వాత ఇతర వాగ్మూలాలు భిన్నంగా ఉన్నాయన్నారు సింఘ్వీ.

## ఖరారు కానున్న 4 కాంగ్రెస్ ఎంపి సీట్లు..

నుంచి ప్రవీణ్ రెడ్డి, సంతోష్ కుమార్ టికెట్ ఆశిస్తున్నారు. తీన్మార్ మల్లన్న పేరు తాజాగా తెరపైకి వచ్చింది. హుస్నాబాద్ స్థానాన్ని అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొన్నం ప్రభాకర్ కోసం ప్రవీణ్ రెడ్డి వదులుకున్నారు. ముగ్గురిలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతోందన్నది ఆసక్తికరంగా మారింది. అసదుద్దీన్ ఓవైసీ పోటీ చేస్తున్న హైదరాబాద్ స్థానం కోసం టెన్నిస్ స్టార్ సానియా మిర్జాతో పాటు షానవాజ్ తుబసం పేర్లను పరిశీలిస్తున్నారు. పెండింగ్ లో ఉన్న ఈ నాలుగు స్థానాలతో పాటు సికింద్రాబాద్ అభ్యర్థి మార్పుపై చర్చించే అవకాశం ఉంది. దానం నాగేందర్ పేరును అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఎమ్మెల్యే పదవికి దానం నాగేందర్ రాజీనామా చేయలేదు. ఆయనను మార్చే పక్షంలో పరిశీలనలో బొంతు రామ్మోహన్ సహా మరికొందరి పేర్లున్నాయి.

## కేజ్రీవాల్‌కు 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధింపు

పొడిగింపు కోరడం లేదని తెలిపారు. ఆయనను జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించాలని కోరారు. విచారణకు ఆప్‌నేత సహకరించడం లేదు. ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదు. దర్యాప్తును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన డిజిటల్ పరికరాల పాస్‌వర్డ్‌లను చెప్పడం లేదు. కొన్ని రోజుల తర్వాత ఆయనను మళ్లీ కస్టడీలోకి తీసుకుంటాం. అప్పటిదాకా జ్యుడిషియల్ కస్టడీ విధించాలని ఈడీ వాదించింది. ఇందుకు న్యాయస్థానం అంగీకరించింది. దీంతో అధికారులు ఆయనను జైలుకు తరలించనున్నారు.
కోర్టు లోపలికి వెళ్లే ముందు కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ చేస్తున్న చర్యలు దేశానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు. ఈ కేసులో ఇప్పటికే ఆప్ నేతలు మనీశ్ సిసోదియా, సంజయ్ సింగ్, భారాస ఎమ్మెల్సీ కవిత అరెస్టయి తిహార్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే.

## బిజెపి మతోన్మాదాన్ని అడ్డుకోవడమే లక్ష్యం

విమర్శించారు. కాళేశ్వరం ఆయనకు ఏటీఎంలా మారిందన్నారు. భారాస ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో వచ్చిన కరవుకు గత ప్రభుత్వమే కారణమన్నారు. ఆ పార్టీ నేతలు ధర్నా చేస్తే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు.

## కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు

ప్రయత్నించారని మండిపడ్డారు. మైక్ సమస్య వస్తే..కరెంట్ కోతలు అంటూ అబద్దాలు మాట్లాడారని చెప్పారు. బొగ్గు లభించే ప్రాంతానికి 350 కి.మీ. దూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ పెట్టారని దుయ్యబట్టారు. దూరంగా ఉండటం వల్ల థర్మల్ ప్లాంటుకు బొగ్గు సరఫరా కోసం భారీగా ఖర్చువుతోంది. పర్యావరణ అనుమతులు పొందటంలో ఆలస్యం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. తెలంగాణకు 4 వేల మెగావాట్ల విద్యుత్ ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉంది. విభజన చట్టం ప్రకారమే రాష్ట్రానికి ఎన్టీపీసీ మంజూరయ్యింది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి ఎ÷-లాంట్ నిర్మించాల్సి ఉంది. కానీ, కమీషన్ల కోసం సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి పవన్ ప్లాంట్ చేపట్టారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నమోదైంది. సరఫరా లేకుంటే ఇంత వినియోగం ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఏప్రిల్, మే నెలలోనూ సరిపడా విద్యుత్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. దేశమంతా గ్రిడ్ అనుసంధానం 2013లోనే యూపీఏ ప్రభుత్వం చేసింది. పదేళ్లలో పాలనలో కేసీఆర్ ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలి. అందరికీ రెండు పడకగదుల ఇళ్లు నిర్మించి ఇచ్చారా?ప్రతి మండలంలో బాలబాలికలకు ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు, ప్రతి నియోజకవర్గంలో కేజీ టూ పీజీ విద్యాలయాలు నిర్మించారా? దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేశారా? రైతులకు రుణమాఫీ ఐదేళ్లలో పూర్తి చేశారా? వర్షాకాలంలో అధికారంలో ఉన్నది ఎవరు? వాననీటిని రిజర్వాయర్లలో నింపే పరిస్థితి లేకుండా చేసిందెవరు? ప్రపంచంలోనే అత్యద్భుతం అని చెప్పిన కాళేశ్వరం కుంగిపోయింది. అన్ని లెక్కలతో చర్చకు రావడానికి నేను సిద్ధం అని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. అంతేగాకుండా తెలంగాణ ప్రజలపై మాజీ సీఎం కేసీఆర్ మోయలేని భారం మోపారని భట్టివిక్రమార్క అన్నారు. కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలేనని అన్నారు. ఇంగిత జ్ఞానం లేకుండా ప్రజలను కేసీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు వేల మెగావాట్ల పవర్ తెలంగాణకు ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉందని చెప్పారు. 2400 మెగావాట్ల పీపీఏ అగ్రిమెంట్లు చేసుకోకుండా కేసీఆర్ కుట్ర చేశారని మండిపడ్డారు. ఆయన పాపం వల్లే ఎన్టీపీసీ రాష్ట్రానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నేతలు లాభం కోసం కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీపీసీ వల్ల కరెంట్ యూనిట్‌కు 9 రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఆ సంస్థకు లక్ష పదివేల కోట్ల రూపాయలను గత కేసీఆర్ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటనకు వస్తున్నామని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పూర్తి చేశామని గుర్తుచేశారు. కేసీఆర్ లాగా ప్రధానమంత్రి కలవడానికి పది రోజులు ఇక్కడే ఉండి కుట్రలు చేయలేదన్నారు. తాము ఇతరులతో చర్చలు జరపలేదన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం కాల్వల్లోకి కేసీఆర్ నీరు వదిలారన్నారు. ఇప్పటికే తాము ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని, కరెంట్‌ను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. 2019 లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే మొదటి నెల ఉద్యోగులకు జీతాలు ఇచ్చిందని... తాము వచ్చిన తర్వాత ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇచ్చామని చెప్పారు. రూ. 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను పెడితే అవి కూడా ఇచ్చుకుంటూ వచ్చామన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 ఉచిత విద్యుత్ ఇచ్చామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను ఇచ్చామని చెప్పారు. 5 ఏళ్లలో మహిళలకు వడ్డీలేని లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు. పంట నష్టం జరిగిన వెంటనే రైతులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ వచ్చాకే వర్షాలు రావడం లేదని కేసీఆర్ అంటున్నారని... జూన్‌లో ప్రభుత్వం బీఆర్ఎస్‌ది కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న దగ్గరి నుంచే వర్షాలు రావట్లేదన్నారు. రిజర్వాయర్‌లో ఎక్కడ నీళ్లు లేకున్నా అది కేసీఆర్ పుణ్యమేనని చెప్పారు. నీటిని సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో నీళ్లు లేకుండా కేసీఆర్ చేశారని భట్టివిక్రమార్క మండిపడ్డారు.

## పెన్షన్ల పంపిణీలో వైకాపా రాజకీయం

### మండిపడ్డ పిసిసి చీఫ్ షర్మిల

న్యూఢిల్లీ,ఏప్రిల్1 (ప్రజా మంటలు):
పింఛన్లు పంపిణీ చేయకుండా వైకాపా ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. రాజకీయ లబ్ధికోసమే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. వీరి రాజకీయం కోసం సామాన్యులు ఇబ్బందులు పడ్డా ఫర్వా లేదన్నారు. పెన్షన్ల పంపిణీకి రాష్ట్రంలో ఉద్యోగులు లేరా అని నిలదీశారు. దిల్లీలో మీడియాతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీరును తప్పుపట్టారు. పింఛన్ల పంపిణీ ఆలస్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారు. ఈ విషయంపై సీఎస్‌తో మాట్లాడాను. 3వ తేదీ నుంచి వారం పాటు పెన్షన్లు ఇస్తామని చెప్పారు. లబ్ధిదారులు పింఛను అందుకునేందుకు 10 రోజులు నిరీక్షించాలా అన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ డీబీటీ ద్వారా ఇవ్వాలని ఈసీ ఆదేశాలిస్తే ఎందుకు అమలు చేయడం లేదన్నారు. డీబీటీ ద్వారా వెంటనే పింఛన్లను పంపిణీ చేయాలి. లేకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ ఆందోళనలు చేపడతాం అని షర్మిల హెచ్చరించారు.

## రైతులకు న్యాయం చేసేందుకు పక్కా ప్రణాళిక

### ట్యాపింగ్‌లో చట్టప్రకారమే కఠిన చర్యలు

### మంత్రి శ్రీదర్ బాబు వెల్లడి



పెద్దపల్లి, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు):
కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల విషయంలో ఒక ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో చట్టప్రకారం శిక్షపడుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వర్షాలు అధిక శాతంలో పడకపోవడం వల్ల నీటి ఎద్దడి ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రైతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వం మాటల వరకే పరిమి తం తప్పా ఆచరణలో పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందిస్తుందన్నా రు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తాం. ఆ తర్వాతే ఎన్నికలకు పోతామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎంపీ సీట్లు గెలవడం కోసం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎంపీ టికెట్ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం అన్నివర్గాలకు న్యాయం చేస్తుందని తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాని సింగ్ తదితరులు ఉన్నారు.

## మోడీ ఫోటో పెట్టుకుంటే గెలవలేరు

### అందుకే రామజపం చేస్తున్న బిజెపి

### కరీంనగర్ అభివృద్ధికి బండి చేసిందేమీ లేదు

### మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు

సిద్దిపేట,ఏప్రిల్1 (ప్రజా మంటలు):
పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ప్రధాని మోదీ ఫొటోతో గెలిచే పరిస్థితిలో లేరని..అందుకనే అయోధ్య రాముడి ఫొటోతో ప్రచారం చేసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రామజపం చేస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాముడు అందరివాడన్నారు. 5 ఏళ్లలో కరీంనగర్ జిల్లా అభివృద్ధికి ఎంపీ బండి సంజయ్ ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. తాను జిల్లాను ఎలా చేశానో ప్రజల అందరికీ తెలుసునని చెప్పారు. సోమవారం నాడు కోహెడ మండలంలోని శనిగరం పెద్ద చెరువును ఆకస్మికంగా సందర్శించారు. శనిగరం గ్రామంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని , అక్కడ అవసరమైన బోర్ వేల్స్ వేసుకోవడంతో పాటు అదనపు మోటార్లు ఏర్పాటు చేసుకోవాలని గ్రామ సెక్రెటరీతో పాటు స్పెషల్ ఆఫీసర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాలల్లో తరగతి గదులకు కలర్స్ వేయడంతో పాటు టాయిలెట్స్ నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎండాకాలంలో ఈసారి ముందుగానే భూగర్భ జలాలు పడిపోయాయన్నారు. కాంగ్రెస్ (అనీనిణసబబ) కరువు తెచ్చిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటున్నారని.. కానీ బీఆర్ఎస్ తెచ్చిన కరువు ఇదని ఎద్దేవా చేశారు. గ్రామానికి , మండలానికి, నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలకు ఏ సమస్య వచ్చిన తాను 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత ప్రతి గ్రామగ్రామాన పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. కొంతమంది భూ పంచాయతీలల్లో తనను ఇన్వాల్వ్ చేస్తున్నారని.. వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు.

## వారణాసి పై సుప్రీం కీల్ ఆదేశాలు

### పూజలు చేసుకోవచ్చని స్పష్టీకరణ

న్యూఢిల్లీ,ఏప్రిల్1 (ప్రజా మంటలు):
ఉత్తరప్రదేశ్ వారణాసిలోని జ్ఞానవాపి మసీదు వివాదంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు ఇచ్చింది. మసీదు దక్షిణం వైపు ఉన్న సెల్లార్‌లో హిందువులు ప్రార్థనలకు అనుమతి నిరాకరించాలన్న మసీదు కమిటీ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే మసీదు ఆవరణలో హిందువులు పూజలు చేసుకునే అంశంలో మాత్రం ప్రస్తుతానికి యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టం చేసింది. మసీదు సెల్లార్‌లో హిందువులు పూజలు చేసేందుకు అనుమతి నిరాకరించాలన్న మసీదు కమిటీ పిటిషన్‌ను జులైలో విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కాగా,మసీదు సెల్లార్‌లో హిందువులు పూజలు చేసుకోవచ్చని గతంలో వారణాసి జిల్లా కోర్టు తీర్పునివ్వగా ఈ తీర్పును అలహాబాద్ హైకోర్టు కూడా ధృవీకరించింది.



## కాంగ్రెస్ పాలనతో మోడీ పాలనను పోల్చుకోండి

### దేశంల ఎంతగా పురోగమించిందో గమనించండి

### మోడీ వచ్చాకనే ప్రపంచంలో గుర్తింపు వచ్చింది

### దేశ అభివృద్ధి కోసం బిజెపికి ఓటేయాలి

### ఓటర్లను కోరిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ప్రజా మంటలు):
గత కాంగ్రెస్ పాలనతో 10 ఏళ్ల మోడీ పాలనను పోల్చుకుని బిజెపికి ఓటేయాలని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఓటర్లను కోరారు. మోడీ వచ్చాక 500 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించారన్నారు. మహిళలకు 33 శాతం కోటా ఇచ్చారని, హైవేలు నిర్మించారని, వ్యవసాయ వృద్ధికి సాయమందించారని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారని అన్నారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అనేక అంశాలపై మాట్లాడారు.



వారు పేదలకు బ్యాంకు ఖాతాలు ఎందుకు అని హేళన చేశారన్నారు. ప్రస్తుతం పేదలు దాదాపు రూ. 2 లక్షల కోట్లు పొదుపు చేశారు. గతంలో నిరర్థక ఆస్తులు చాలా ఉండేవి. బిజెపి ప్రభుత్వం వచ్చాక 55 కోట్ల కొత్త బ్యాంకు ఖాతాలు ఇచ్చామన్నారు.కాంగ్రెస్ హయాంలో ద్రవ్యోల్బణం 12శాతానికి పైగా ఉండేదన్నారు.
బీఆర్ఎస్ పార్టీ అత్యంత వేగంగా పతనం అవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కేసీఆర్ హకరించలేదన్నారు. ప్రారంభోత్సవానికి మాత్రమే కేసీఆర్ వచ్చారని తెలిపారు. ఆ తర్వాత ఎప్పుడూ కేసీఆర్ దానిని పట్టించుకోలేదని విమర్శించారు. తండ్రీ, కొడుకులతోనే తెలంగాణ నాశనమయిందని వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌ను చూసి జాలిపడాలన్నారు. ఓటమి తర్వాత కూడా ఆయన సీఎం అయినట్టు ఫీల్ అవుతున్నారని అన్నారు. పదేళ్లుగా దేశంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపైనే బీజేపీ ప్రచారం ఉంటుందని వెల్లడించారు. సీఎం కావాలనుకున్న కేటీఆర్ ఆశలయ అడియాశలు అయ్యాయన్నారు. అవినీతి ఆరోపణలు లేకుండా మోదీ పాలన సాగిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యిందన్నారు. ప్రజల బ్రతుకులు మారలేదన్నారు. తాత్కాలికంగా ఓట్లు పొందేందుకే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేసిందని విమర్శించారు. ప్రపంచానికే సాయం చేసే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. సంక్షేమం కోసం 34 లక్షల రూపాయలు ఖర్చు చేసింది మోదీ ప్రభుత్వమని తెలిపారు. దేశంలో డిజిటల్ విప్లవం తీసుకుని వచ్చామమని.. జీఎస్టీ వ్యాపారస్తులకు వరంగా మారుతోందన్నారు. 1.66 లక్షల కోట్ల రూపాయలు ప్రతి ఏటా జీఎస్టీ ద్వారా దేశానికి ఆదాయం వస్తుందన్నారు. 26,500 కోట్ల డిజిటల్ ట్యాన్జక్షన్స్ దేశవ్యాప్తంగా జరిగాయన్నారు. ఎంఎస్‌ఎంఈల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చాయన్నారు. జనధన్ ఖాతాలతో 2 లక్షల కోట్ల రూపాయలు నేడు వారి సేవింగ్స్ అకౌంట్‌లలో జమ చేసుకున్నారన్నారు. పన్ను రాయితీ 7 లక్షల రూపాయలకు పెంచింది మోదీ ప్రభుత్వమని చెప్పారు. హైదరాబాద్ మెట్రోకు 12 వేల కోట్ల రూపాయలు ఆర్థిక సాయం చేసిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంతో ప్రమాదాలు తగ్గిపోయాయన్నారు. 20 వేల కిలోమీటర్ల మేర రైల్వే లైన్‌లకు విద్యుదీకరణ పూర్తి అయ్యిందన్నారు. రోడ్ నెట్వర్క్‌లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నామన్నారు. 101 దేశాలకు కరోనా వ్యాక్సిన్ అందజేశామని.. 411 కంపెనీలు దేశంలో సెల్‌ఫోన్ ఉత్పత్తి చేస్తున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## సంక్షోభంలో ఉన్న రైతన్నలను ఆదుకోవాలి..

### తహసీల్దార్ మెమోరాండం ఇచ్చిన బీజేపీ నాయకులు

భీమదేవరపల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు)
తీవ్రమైన సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతూ, మండల బిజెపి నాయకులు మండల తహసిల్దార్ కు మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, పండించిన పంటకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. పంట నష్టం అంచనా వేసి ఎకరాకు రూ.10 వేలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇంతవరకు పరిహారం అందించలేదని ఎద్దేవా చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని బిజెపి మండల శాఖ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిల్లర్లతో సంబంధం లేకుండా వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినందున వెంటనే ఆ మేరకు కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ రైతు భరోసా కింద రైతులతోపాటు, కౌలు రైతులుకు ఎకరాకు రూ.15 వేలు, భూమి లేని వ్యవసాయ కూలీలలకు రూ.12 వేలు ఇవ్వాలని అన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని అన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పంటలకు అనుసంధానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పృథ్వీరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, జిల్లా కార్యదర్శి మాచర్ల కుమార్, శ్రీరామోజు శ్రీనివాస్, దొంగల వేణు, అంబీర్ కవిత, మెట్టు అశోక్ రావు, పిల్లి రవీందర్, పోడేటి బిక్షపతి, బైరి సదానందం, సతీష్, పాపారావు, నాగవెల్లి సంపత్, రాజేందర్, అలుగు భాస్కర్, మోలుగు సంపత్, శ్రీనాథ్, వినోద్, విజయ్, మాధవి. రాజమ్మ, కవిత, త్రిజ్ఞానేశ్వర్, ఉదయ్, జకనపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి గ్రామానికి త్రాగునీటి సరఫరా కార్యాచరణ రూపకల్పన

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**త్రాగునీటి సరఫరా పరిశీలనకు ప్రత్యేక అధికారుల నియామకం**
**నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో మద్దతు ధరపై కొనుగోలు**
**జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**



**జగిత్యాల ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** రానున్న రెండు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామానికి, జనావాసానికి త్రాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వేసవిలో త్రాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనపై, వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, వేసవి కాలంలో త్రాగునీటి సరఫరాపై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని సన్నద్ధంగా ఉండి, ప్రతి రోజు త్రాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎక్కడ, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సజావుగా త్రాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన పనులు పూర్తి చేశామని అన్నారు. త్రాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల, గ్రామ స్థాయిలలో ప్రత్యేక అధికారులను నియమించాలని సి.ఎస్. కలెక్టర్లకు సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకుంటూ గ్రామ స్థాయిలో రానున్న రెండు నెలలకు త్రాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని సీఎస్ సూచించారు.


పట్టణాలలో, గ్రామాలలో త్రాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరా సప్లిమెంట్ చేయాలని సిఎస్ పేర్కొన్నారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్ర స్థాయిలో త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి వాటిని సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రిజర్వాయర్లలో త్రాగునీటికి అవసరమైన మేర సమృద్ధిగా నీరు అందుబాటులో ఉందని, త్రాగునీటి సరఫరాను ప్రతిరోజు పర్యవేక్షిస్తూ సక్రమంగా నిర్వహిస్తే ఎటువంటి త్రాగునీటి ఇబ్బందులు ఎదురు కావని సీఎస్ పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రం లేని కారణంగా రైతులు ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తున్నారనే మాట రావద్దని సీఎస్ స్పష్టం చేశారు. నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ అంశంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రతి రైతు వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సరఫరా, టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని సి.ఎస్. అన్నారు.

జిల్లాలలో వరి సాగు చేస్తున్న రైతులను సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలని, ప్రణాళిక బద్ధంగా కొనుగోలు కేంద్రం వద్దకు రైతు ధాన్యం తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానాకాలం 2023-24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రతి రోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యం తో నడిచేలా చూడాలని, సిఎంఆర్ రా రైస్ డెలివరీపై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎండ సమయాల్లో బయటికి వెళ్లకుండా ఉండాలని తెలిపారు. జిల్లాలో ముఖ్య కూడళ్లలో, కార్యాలయాల్లో, అధికారుల వాహనాల్లో, దేవాలయ ప్రాంగణాలు, ఉపాధి హామీ పనుల స్థలాల్లో, పాఠశాలలు, వరి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలలో, రద్దీ ప్రదేశాలు ఉన్నచోట ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభించాలని తెలిపారు. ఆయా కేంద్రాల్లో త్రాగునీరు, ఓ ఆర్ ఎస్ పాకెట్స్ ఉంచాలని, ధాన్యం కొనుగోలు ధరలు, టోల్ ఫ్రీ నెంబర్, తదితర విషయాలు తెలిసే విధంగా బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు దివాకర, పి.రాంబాబు, డిఆర్ డిఓ స్, సంపత్ రావు ఎం హెచ్ ఓ శ్రీధర్, డి ఈ ఓ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్ రావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హతీరాం, డి పి ఓ దేవరాజ్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరు రహమాన్, మిషన్ భగీరథ ఈ ఈ ఇంట్రా సతీశ్, ఈ ఈ గ్రిడ్ శేఖర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దంచికొడుతున్న ఎండలు
## 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు




**నల్లగొండ,ఏప్రిల్1 (ప్రజామంటలు):** రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల గరిష్టానికి చేరుకున్నాయి. సూర్యుడి ప్రతాపంతో ఉదయం నుంచే ఉక్కపోత మొదలవుతున్నది. పొద్దున 9 గంటలకే భానుడు భగభమంటున్నాడు. రాబోయే 5 రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతారణ కేంద్రం తెలిపింది. 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగాడ్పుల ముప్పు అధికంగా ఉంటుందని పేర్కొంది. నల్లగొండ జిల్లాలోని శివన్నగూడెంలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మరో రెండు రోజుల్లో ఉష్ణో గ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు.



# కేశవరావుకు మతిభ్రమించింది
## మాజీ ఎమ్మెల్యే రసమయి విమర్శలు

**హైదరాబాద్, ఏప్రిల్1 (ప్రజామంటలు):** ఎంపీ కేశవరావు కు మతి భ్రమించినట్లుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మిలియన్ మార్చ్‌లో కేశవరావును కొడిగుడ్లతో కొట్టిన ఘటనలను గుర్తు చేసుకోవాలన్నారు. ఇవాళ పాట లేదు మాట లేదని కేశవరావు మాట్లాడుతున్నారని.. ఆయన భాష ఎవరికి అర్థం కాదన్నారు. కేశవరావు బిడ్డ అంటే ఎవరో తెలియదని.. అలాంటి ఆమెకు కేసీఆర్ హైదరాబాద్ మేయర్ పదవి ఇచ్చారన్నారు. పాటకు చరిత్ర లేకపోతే జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా ఎలా తీసుకున్నారని రసమయి ప్రశ్నించారు. తెలంగాణ సంస్కృతిని అవమానించడం కేకేకు సరికాదన్నారు. కేశవరావు వెంటనే కళాకారులకు క్షమాపణ చెప్పాలని రసమయి డిమాండ్ చేశారు. లేదంటే ఆయన ఇంటి ముందు ధూం ధాం నిర్వహిస్తామన్నారు. ఓట్ల కోసం గద్దర్ అన్నను వాడుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచి తెలంగాణ బతుకుల మీద విషం చిమ్ముతూనే ఉందన్నారు. కడియం కావ్యకు బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం లేదన్నారు. కడియం శ్రీహరి ఏ బడిలో చదువుకున్నారో.. ఎక్కడ బడి చెప్పారో ఎవరికీ తెలియదన్నారు. కడియం శ్రీహరి మాదిగ ద్రోహి అని.. మాదిగ జాతి అంటేనే ఆయనకు కళ్ల మంట అని రసమయి పేర్కొన్నారు. కడియం శ్రీహరి వైఖరి వల్లనే తాడికొండ రాజయ్య, ఆరూరీ రమేష్ వెళ్ళిపోయారని రసమయి అన్నారు. మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ మాదిగలకు సీటు ఇవ్వకపోతే చావు డప్పు కొడుతామన్నారు. వరంగల్‌లో కడియం శ్రీహరిపై చావు డప్పు కొడుతామని హెచ్చరించారు. ముసలి నక్కలన్నీ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నాయని రసమయి అన్నారు. మా పార్టీ ఆదేశిస్తే తాను వరంగల్ నుంచి పోటీ చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు ఎన్ని సీట్లు ఇచ్చారనే దానిపై మందకృష్ణ మాదిగ అన్న ఎందుకు మాట్లాడం లేదని రసమయి ప్రశ్నించారు.



# ఎపి కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ఖరారు
## నేడు అధికారికంగా ప్రకటించే ఛాన్స్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడే అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసినట్లు సమాచారం. 117 అసెంబ్లీ స్థానాలకు, 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించనున్నట్లు ఏపీ కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మల పేర్కొన్నారు. ఇక సీనియర్ నేత, మాజీ పీసీసీ రఘువీరా రెడ్డి ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నట్టు సమాచారం. అటు అసెంబ్లీ, ఇటు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనని, కేవలం ప్రచారంలో మాత్రమే పాల్గొంటానని రఘువీరారెడ్డి అధిష్టానానికి చెప్పినట్లు సమాచారం. ఇక కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ షర్మిల పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కాకినాడ నుంచి పల్లం రాజు, బాపట్ల నుంచి జేడీ శీలం, రాజమండ్రి నుంచి గిడుగు రుద్రరాజు పోటీ చేయనున్నట్లు సమాచారం.

# ఘనంగా ప్రభుత్వ విప్ అడ్లూరి జన్మదిన వేడుకలు



**ధర్మపురి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం లక్ష్మణ్ కుమార్ ధర్మపురి క్షేత్రం లోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానాన్ని దర్శించుకుని ప్రధాన ఆలయమైన యోగానంద నరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. వేద పండితులు ఆశీర్వచనం గావించారు.

**జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదినం సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం లో ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యుల ఆధ్వర్యంలో దేవాలయ అర్చకులచే ఉదయం అభిషేకం,అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ మాట్లాడుతూ.....ధర్మపురి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో శాసనసభ్యులుగా ఎన్నికైన అడ్లూరి లక్ష్మణ్ భవిష్యత్ లో ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతున్ని కోరుకుంటూ వారికి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు స్తంబంకాడి గణేష్, మాదాసు మల్లేష్, నేదునూరి శ్రీధర్, కొమిరెల్లి పవన్ వేముల రాజేష్, ఓజ్జల లక్ష్మణ్, గుడ్ల రవి, రమణ, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

**సాంబశివ దేవస్థానంలో ప్రత్యేక పూజలు**

ధర్మపురి మండలంలోని నేరెళ్ళ గ్రామంలో శ్రీ సాంబశివ దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదినం పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి, న్యాయవాది జాజాల రమేష్ ఆధ్వర్యం లో ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మణ్ కుమార్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని భగవంతుని ప్రార్థించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి, 200 మందికి ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణి చేశారు. కార్యక్రమంలో జంగిలి తిరుపతి, కోదురుపాక మల్లేశం, పాల గణేష్, మెరుగు పరుశురాం, కసారపు సాంబయ్య, బోరే మల్లేశం, గుడి మల్ల శేఖర్, పాదం నరేష్ , కార్యకర్తలు గ్రామస్థులు, అభిమానులు పాల్గొన్నారు.

**బర్త్ డే కేక్ కట్ చేసిన లక్ష్మణ్ కుమార్**

ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయంలో లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ కుమార్ కేక్ కట్ చేసి, అందరికీ అందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డిజే పాటల మధ్య అతిపెద్ద గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిజేశారు. అలాగే పలు గ్రామాల్లో లక్ష్మణ్‌కుమార్ జన్మదినవేడుకలనుఘనంగా నిర్వహించారు.

# కెసిఆర్ రాజకీయ అసహనానికి పరాకాష్ట

**పార్టీని వీడిన వారిని చిల్లరగాళ్లు అనడం సబబా**
**నిజాలు తెలియకుండా కెసిఆర్ విమర్శలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** మేడిగడ్డ కుంగుబాటు చిన్న విషయమట..పంటలకు నీళ్లు అందకపోవడం ప్రభుత్వ వైఫల్యమట.. ప్రభుత్వం చేతగాకపోతే దిగిపోవాలట... నీరు అందించడం లేదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత రంకెలు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తన అక్కసును వెళ్లగక్కారు. తాను ఉండివుంటే అని చెప్పకపోయినా..రైతులకు అలాంటి భ్రమలే కల్పించారు. ఇంతకాలం కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ కెటిఆర్, హరీష్ రావులు అంటే..వారి బాటలోనే కెసిఆర్ విమర్శలు చేశారు. ఆయన మాటలు చూస్తుంటే సగటు మనిషికి కూడా ఆగ్రహం తెప్పించేదిగా ఉంది. చేసేదంతా చేసిన కెసిఆర్ ఇప్పుడు నెపాన్ని కాంగ్రెస్ మీదకు నెట్టాలని చూశారు. తన కాలంలో జరిగిన పాపాలకు కనీసంగా స్పందించడం లేదు. అధికారమంటే బాధ్యత అనే విషయం విస్మరించి, తమకు ప్రత్యర్థులే ఉండకూడదన్న ధోరణితో వ్యవహరించిన కెసిఆర్ అడ్డగోలుగా గెలిచిన ఎమ్మెల్యేలను తన మందలో తోలుకున్నారు. తెలంగాణ పునరేకీకరణ అంటూ వక్ర భాష్యాలు చెప్పారు. కలసి పనిచేద్దామని అన్నారు. ఆనాడు ఆయన చెపింది వేదం అయినప్పుడు ఇప్పుడది అర్థం మారుతుందా ..అన్నది ఆయనే చెప్పాలి. ఇప్పుడేమో ఒకరిద్దరు చిల్లరగాళ్లు పోయినంత మాత్రాన నష్టం లేదని బీరాలు పలుకుతున్నారు. నిజానికి పార్లమెంట్‌కు పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకని దురవస్థ కేసీఆర్‌కు దాపురించింది. నిన్నటి వరకు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం కాంగ్రెస్,బీజేపీలు వెతుక్కొన్నాయి. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని లాక్కున్నాయి. రాజకీయాల్లో అదీ ఎన్నికల ముందు ఇది సర్వసాధారణం. ఇప్పుడు బీఆర్ఎస్ తరపున టికెట్ పొందినవారు కూడా మాకొద్దీ టిక్కెట్ అటూ పారిపోతున్నారు. అధికారంలో ఉండగాకేసీఆర్ విర్రవీగిన రోజులు అప్పుడే మరచిపోలేం. అందుకే ఆయనకు ఈ తరహా పతనమే తప్పదని కాలం గట్టిగానే చెప్పింది. అధికారంలో ఉన్నప్పుడు బలమైన నాయకులను పక్కన పెట్టిన కారణంగా ఇప్పుడు



అధికారం కోల్పోయాక ఒంటరిగా అఘోరిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంతో మమేకమై పార్టీని నమ్ముకొని ఉన్నవాళ్ల ను కాదని ప్రజాబలం లేని వాళ్లను, తనకు వంత పాడే వాళ్లను కేసీఆర్ తన చుట్టూ భజన బృందందగా చేసుకున్నారు. ఫలితంగా బలమైన నాయకులు దూరమయ్యారు. ప్రజాబలం లేకపోయినా కేసీఆర్ మనసెరిగి వ్యవహరించడం ద్వారా లాభపడుతూ వచ్చిన వాళ్లు ఇప్పుడు ఒక్కొక్కరుగా ఆయనను విడిచి వెళ్లిపోతున్నారు. ఉద్యమకారులను అవమానించిన కెసిఆర్ ఇప్పుడు చిల్లరగాళ్లు అని వ్యాఖ్యానించడం ఆయన ఆక్రోశాన్ని వెల్లగక్కించేలా చేసింది. ఆనాడు అవసరార్థం కెసిఆర్ వద్దకు వచ్చిన వారు..ఇప్పుడు తమ అవసరార్థం మళ్లీ పార్టీ మారుతున్నరు. ఆనాడు ఎంత అవకాశవాదం ఉందో..ఇవాళ కూడా అంతే అవకాశవాదం వుంది. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన రంజిత్ రెడ్డి, మహేందర్ రెడ్డి తనను పిచ్చోడ్ని చేశారని కేటీఆర్ వాపోయారు. నిజానికి కెసిఆర్ కుటుంబమంతా కలసి ప్రజలను పిచ్చోళ్లను చేశామని వారికి మాత్రమే తెలిసిన విద్య. రాజకీయాల్లో పర్మినెంట్ విధేయత పార్టీ అన్నది ఏనాడో లేకుండా పోయింది. అధికారంలో ఉన్న పార్టీలోనే ఉండడానికి నేతలు ఇష్టపడుతున్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన అనేక మంది పోటీ పడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థులలో రంజిత్ రెడ్డి, కడియం కావ్య కాంగ్రెస్‌లోకి వెళ్లడం బిఆర్ఎస్ పార్టీ దీనావస్తను సూచిస్తోంది. మరికొందరు అదే బాటలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో మమేకమై పార్టీనే నమ్ముకున్న వారిలో ఎవరికి కూడా టికెట్ ఇవ్వకుండా తొలినాళ్లలో అవమానం చేశారు. అధికారం వచ్చాక అలాంటి వారిని దూరం పెట్టారు. అందుకే దానిఫలితం కేసీఆర్ ఇప్పుడు అనుభవిస్తున్నారు. కేసీఆర్ పట్ల ఇప్పుడు ప్రజల నుంచి కనీసం సానుభూతి రావడం లేదు. కేసీఆర్ కుటుంబంపై తెలంగాణ సమాజంలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. కవితను అరెస్ట్ చేసినా ప్రజల్లో ఎక్కడా సానుభూతి రాలేదు. ఆ కుటుంబ వ్యవహార శైలే ఇందుకు కారణం అని చెప్పిక తప్పదు.. అధికారంలో ఉన్నప్పుడు నిరంకుశంగా వ్యవహరించిన కారణంగానే కెసిఆర్ ప్రజాదరణ కోల్పోయారు. చేసిన తప్పులను తెలుసుకుని ఇప్పుడున్న ప్రభుత్వానికి తగని మంచి సూచనలు చేస్తూ.. తెలంగాణ అభివృద్ధికి ముందుకు వస్తే కేసీఆర్‌ను మళ్లీ ప్రజలు ఆదరించవచ్చు.రాష్ట్రం విడిపోయిన పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కెసిఆర్ అహంకారం ఒక్కటే కారణమని గుర్తించకుండా ఇంకా విమర్శలు చేస్తే ప్రజల్లో ఉన్న ఆదరణ కూడా పోతోంది.

# ఫోన్ ట్యాపింగ్‌లు.. డబ్బుల పంపిణీ ప్రకంపనలు !

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ లాగితే అనేక విషయాలు బయట పడుతున్నాయి. ఇందులో టాస్ట్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యలంలో ఎన్నికల్లో డబ్బుల పంపిణీ జరిగినట్లు తాజాగా గుర్తించారు.ఎన్నికల్లో గెలవడానికి, విపక్షాలను నిలవురించడానికి ఎంతగా అధికార దుర్వినియోగం జరిగిందో గమనించవచ్చు. నిజంగా ఇంత దారుణం జరగడం క్షమించరాని నేరంగా పరిగణించాలి. ఎన్నిక ల్లో గెలవడం కోసం పోలీసులను ఉపయోగించుకుని బయటపడుతన్నామన్న ధీమాతో ఉన్నప్పటికీ ప్రజలు ఇచ్చిన సాక్‌తో కెసిఆర్ మైండ్ బ్లాక్ అయ్యింది. ఎపిలోనూ ఇంతకాలం ఇదే తరహాలో వ్యవహారం నడిచిందని తెలుస్తోంది. అక్కడా ప్రభుత్వం మారితేనే అసలురంగు బయటపడుతుంది. గతంలో వైఎస్ హయాంలో 108 వాహనాల్లో డబ్బుల సరఫరా జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడేమో పోలీసుల సమక్షంలోనే ఇలా డబ్బుల చేరవేత జరిగిందన్న ఆరోపణలు రావడం దుర్మార్గమైన కిరాతక చర్యగా చూడాలి.
ప్రజలకోసం అని బయలుదేరి రైతులను పరామర్శించేందుకు వెళ్లిన కెసిఆర్ హుంకరింపులు చూస్తే సాధారణ తెలంగాణ వాసులు గుండెలు మండుతున్నాయి. ఆయనలో ఉన్న అసహనం బయట పడుతుంది. ఇన్ని అవకతవకలు బయటపడుతున్నా ఒక్కమాట కూడా మాట్లాడకుండా, ప్రభుత్వంపై నిందలు వేసే ప్రయత్నం చేయడం..దొంగేదొంగ అన్నట్లుగా ఉంది. ఇంతకాలం కెటిఆర్, హరీష్ రావు, కవితలు మాత్రమే ఇలా అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడు కెసిఆర్ కూడా తన అక్కసును వెళ్లగక్కు తున్నారని అర్థం అయ్యింది. అధికారం పోవడంతో కెసిఆర్ రంకెలు వేస్తున్నారు. కెసిఆర్ హయాంలో సిట్ అధికారులు ఎంత అరాచకంగా వ్యవహరించారో ఇప్పుడు తెలంగాణ పోలీసుల విచారణలో బయట పడుతుంటే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. కొంతమంది అధికారులు ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు తాము పోలీస్ అధికారులం అన్న విషయం విస్మరించి, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకంటే అధ్వానంగా డబ్బులను కూడా పంచారన్న విషయం చూస్తుంటే ఎంతగా బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. విచారణ సమయంలో ఇప్పుడు అదుపులోకి తీసుకున్న పోలీసు అధికారుల్లో అత్యధికులు కెసిఆర్ సామాజిక వర్గానికి చెందినవారు కావడం కూడా కులగజ్జితో ఎంతకు తెగించారన్న విషయం మరింత ఆగ్రహం కలిగిస్తోంది. అంటే కులరక్కసి ఎంతగా పనిచేసిందో అర్థం చేసుకోవచ్చు. ఒకే సామాజిక వర్గానికి చెందిన కొందరు పోలీసు అధికారులు విచ్చలవిడితనంతో తెలంగాణను గుప్పిట పెట్టుకుని అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారన్నది ప్రజలకు తెలిసి వస్తోంది. ఇప్పుడు పలువురుని ప్రశ్నిస్తే మా ఫోన్లు కూడా ట్యాపింగ్‌లో ఉన్నాయిని చెబుతున్నారు. ఏకంగా ఓ బిల్డర్



పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. తన ఫోన్ ట్యాపింగ్ చేసి తనను బెదరించి కోట్లు కొల్లగొట్టారని ఆరోపించాడు. ఇప్పుడా విషయంలోనూ విచారణ సాగుతోంది. కెసిఆర్ ప్రభుత్వం గద్దె దిగాక ...స్వేచ్ఛ వచ్చింది.. ఫోన్లు మాట్లాడే స్వేచ్ఛను పొందామని ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పడం చూస్తే వీటి ఆగడాలు ఎంతగా మితిమీరి పోయాయో గమనించవచ్చు. ఎపిలోనూ ఇలాంటి తతంగమే జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. టిడిపి ఈ విషయంలో ఆరోపణలు చేస్తూనే ఉంది. అంటే తెలుగు రాష్ట్రాల్లో ఫోన్ ట్యాపింగ్ అన్నది ఒకే తరహాలో సాగిందని అర్థం చేసుకోవచ్చు. ఇరువురు ప్రభుత్వాధినేతలు కూడ బలుక్కుని చేశారని అనిపిస్తోంది. ఇకపోతే తమ ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయి, దీంతో తమ కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్నారని పిసిసి చీఫ్‌గ ఆఉన్న సమయంలో రేవంత్ తీవ్ర ఆరోపణలు చేశారు. నాటి ఇంటిలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు పేరు చెప్పి గట్టి హెచ్చరికుల చేశారు. ఈ క్రమంలో ఆనాటి ప్రభుత్వంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారిగా భావిస్తున్న టి.ప్రభాకర్‌రావు పోలీసుల ఎదుట లొంగి పోనున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు అరెస్టయిన పోలీసు అధికారులు.. దర్యాప్తులో ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం అంటూ వాంగ్మూలం ఇవ్వడంతో అన్ని వేళ్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ వైపే చూపుతున్నాయి. దాంతో ప్రభాకర్‌రావు అమెరికా నుంచి తిరుగు ప్రయాణ మయ్యారనే సంకేతాలు వస్తున్నాయి. గత ప్రభుత్వం చెప్పింది మేం చేశాం ప్రభాకర్ రావు ఇప్పటికే ఓ పోలీస్ అధికారితో వ్యాఖ్యానించారనే విషయం తెలిసిందే..!మొత్తంగా టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు దర్యాప్తులో చెబుతున్న విషయాలు విస్తు గొలిపేవిగా ఉన్నాయి. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా వారు ఏం చేశారో కూడా విచారణ సందర్భంగా నిందితులైన అధికారులు చెప్పుకొచ్చారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీలు నగదు తరలించకుండా కట్టడి చేయడంతోపాటు అధికార పార్టీకి చెందిన నగదును పోలీసు వాహనాల్లో తరలించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొందరు అధికారులు తమ పరిమితిని అతిక్రమించి వ్యవహరిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. రేపు ఆంధప్రదేశ్‌లో ప్రభుత్వం మారితే అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించిన అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులపై టెలిగ్రాఫ్ చట్టం ప్రయోగించాలని తెలంగాణ పోలీసులు నిర్ణయించుకొని న్యాయస్థానం అనుమతి కోరారు. న్యాయస్థానం అనుమతిస్తే నిందితులపైన టెలిగ్రాఫ్ చట్టం కింద కేసు పెడతారు. అప్పుడు విచారణలో నేరం రుజువైతే ఉద్యోగాలు పోవడమే కాకుండా జైలుకు వెళ్లాల్సి వస్తుంది. మొత్తంగా కేసీఆర్ ప్రభుత్వం ఎంత అడ్డగోలుగా వ్యవహరించిందో తెలిపే సంఘటనలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వీటన్నిటి పైనా విచారణ చేయించి కఠినంగ ఆశిక్షిస్తే తప్ప అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ నేతలు చేసిన ఆగడాలకు అడ్డుకట్టవేయలేం. ఇలాంటి నేతలను గుర్తించి ప్రజలు వారిని దూరం పెట్టాలి. ఇలాంటి వారిని ఆదరిస్తే నష్టపోయేది ప్రజలే అని తెలుసుకోవాలి.



## అబద్దాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ కాంగ్రెస్‌తో పాటే వచ్చిన కరువు

**గద్వాల ఎమ్మెల్యే బండ్ల విమర్శలు**

జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 1 (ప్రజామంటలు):
అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరువు వచ్చిందని, కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు సోమవారం జిల్లాలోని కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామ శివారులో గల వ్యవసాయ పొలంలో ఎండిన పంటలను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తానన్న ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని ధ్వజమెత్తారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ అంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అన్నదాతలను పూర్తిగా ఆగం చేసిందని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఎండిన పంటలకు ప్రతి ఎకరాకు రూ. 25వేల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీపై పట్టుకు రేవంత్ రెడ్డి కొత్త వ్యూహాలు

**సి హెచ్ వి ప్రభాకర్ రావు,**
**సీనియర్ జర్నలిస్ట్. 9391533339..**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన తరువాత జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనదైన పట్టు నిరూపించుకోవవడానికి ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అయిన రేవంత్ రెడ్డి పూర్తి స్థాయి దృష్టి సారించినట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ అంటే అనైక్యతకు చిహ్నంగా చెప్పుకొనే వారు ఇప్పుడు అంతా ఒక్కటిగా ఉన్నట్లు నటిస్తున్నారని, వీలనపుడు రేవంత్ ను తొక్కిపెట్టి, తమ సత్తా చూపాలనే దూరాలోచనలో ఉన్నట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు.తెలుగుదేశం పార్టీలో ఉంటూ, కాంగ్రెస్ వ్యవహార శైలిని గమనించిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ లో చేరిన రోజు నుండి తన ఉనికికి అడ్డుగా ఉండే సీనియర్ నాయకులను కట్టడి చేస్తూ, తన వర్గాన్ని,ముఖ్యంగా తెలుగుదేశంలోని పాత మిత్రులను, భారాస లోని అసంతృప్తులను కాంగ్రెస్ లోకి లాగి, తన సామ్రాజ్యాన్ని నిర్మించుకొంటున్నారనే విషయం స్పష్టమౌతుంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్న హైదరాబాద్ ప్రాంతంలో, ఉత్తర తెలంగాణలో ఇతర పార్టీలలో ఉన్న బలమైన ప్రజా నాయకులను, బలహీన వర్గాల వారిని కాంగ్రెస్ లోకి తేవడానికి తన ప్రయత్నాలన్నీ చేస్తున్నట్లు తెలుస్తుంది.
ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని సిరుపూర్ నియోజక వర్గం

### బిజేపి, భారాసలనుండి అసంతృప్తులకు గాలం - గెలిచేవారికి, గెలిపించే వారికి పార్టీ కండువా

ఎమ్మెల్యే కోనేరు కొనప్ప ను కాంగ్రెస్ లో చేర్చుకోవాదంతో పాటు, ఆయనకు అత్యంత సన్నిహితుడైన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కూడా పార్టీలో చేర్చుకోవడానికి అన్నీ ఏర్పాట్లు జరిగినట్లు తెలుస్తుంది. అలాగే నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో విజయం సాధించడానికి వీలుగా, బలహీన వర్గాల అభ్యర్థికయి కాంగ్రెస్ వేట మొదలు పెట్టింది. ఇప్పటికే భారాస, బిజెపి పార్టీలు మున్నూరు కాపు వర్గానికి చెందిన బాజరెడ్డి గోవర్ధన్, అరవిందహ ధర్మపురి లకు టిక్కట్లు ప్రకటించాయి.కాంగ్రెస్ నుండి టిక్కట్టు ఆశిస్తున్న ఎమ్మెల్సి జీవన రెడ్డిని ప్రక్కన పెట్టి, బలమైన బలహీన వర్గాల అభ్యర్థి వెదుకులాటలో మరో ఎమ్మెల్సీ, పూర్వ తెలుగుదేశం పార్టీ సహచరుడు ఎల్. రమణ కు గాలం వేసినట్లు ప్రచారం జరుగుతుంది.
పద్మశాలి వర్గానికి చెందిన ఎల్. రమణకు, గతంలో ఏంపీగా, మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. అలాగే నిజామాబాద్ నియోజక వర్గంలోని జగిత్యాల, కోరుట్ల, ఆర్మూర్ నియోజక వర్గాలలో నేత కార్మిక వోటర్ల సంఖ్య కూడా గణనీయంగానే ఉంటుంది. మరో వైపు నిజామాబాద్ నియోజకవర్గానికి చెందిన మహేశ్వర గౌడ్ కూడా టిక్కట్టు ఆశిస్తున్నారు. ఈ పార్లమెంట్ ఫరిధిలో గౌడ్ కుల వోటర్లు అధికంగానే ఉన్నారు.
హైదరాబాద్ మహానగర ఫారిధిలోని 4 ఏంపి స్థానాలే ముఖ్యం తెలంగాణకు గుండెకాయ లాంటి హైదరాబాద్ మహానగరం నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉండడం, ఈ జిల్లాల్లో శాసన సభ స్థానాలన్ని, ఒక్క మెదక్ స్థానం తప్ప మిగతావి భారాస, ఎం ఐ ఎం, బిజేపి అభ్యర్థులే గెలవడంతో, ఇక్కడి నాలుగు పార్లమెంట్ స్థానాలు గెలవడం కాంగ్రెస్ కు జీవన్మరణ సమస్యలా మారింది. ఈ నియోజక వర్గాలలో పేరున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు చాలా మంది గతంలోనే భారాశలోకి, బజపలోకి వెళ్లి పోయారు. మళ్ళీ వారందరినీ కాంగ్రెస్ లోకి తీసుకొస్తే తప్ప పార్టీ మనుగడ కష్టమే అని భావించిన రేవంత్ రెడ్డి ఆయా పార్టీలలో ఉన్న పూర్వ తెలుగుదేశం మిత్రులను, కాంగ్రెస్ నాయకులను కాంగ్రెస్ లో చేర్చుకోవడానికి వ్యూహాలు అమలు చేస్తున్నారు.

**బిజేపిని అడ్డుకోవడానికి కాంగ్రెస్ వ్యూహం**

రాష్ట్ర శాసన సభలో, నాల్గవ వంతు శాసన సభ్యులున్న, ఈ ప్రాంతంలోని నాలుగు పార్లమెంటు స్థానాల్లో హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఎం ఐ ఎం అభ్యర్థి అసదోద్దీన్ ఒవైసీ గెలుచుకోవడం ఖాయంగా ఉన్నా, మిగతా మూడింటిని గెలులుచుకోవడానికి కాంగ్రెస్ శతవిధాల ప్రయత్నిస్తుంది. ఎం ఐ ఎం తో మైత్రి కోరుకొంటున్న కాంగ్రెస్ ఈ సీటులో అంతా బలమైన అభ్యర్థిని నిలపక పోవచ్చని, కాంగ్రెస్ అభ్యర్థి బలంగా ఉండడం అంటే, అది బిజేపికి లాభం చేకూర్చడమేననే వాదన కూడా వినిపిస్తుంది. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని శాసన సభాసత్తాలను ఏడింటిలో, ఒక్క గోషామహాల్ తప్ప మిగతా అన్నీ స్థానాలను ఎం ఐ ఎం గెలుచుకోంది. ఈ సారి బిజేపి కూడా గట్టి పోటీ ఇయ్యయాలని మహిళా అభ్యర్థిని నిలబెట్టింది. దీనిపై ఆ పార్టీలో అసంతృప్తి ఉన్నా, మతం ఆధారంగా, బిజేపి అభ్యర్థి కొంపల్లి మాధవీలత చేస్తున్న ధార్మిక కార్యక్రమాలను విశ్వసించే హిందువులను ఏకతాటిపైకి తెచ్చి, పేద ముస్లిం లను ఇతర సేవా కార్యక్రమాల ద్వారా ఆకట్టుకోవాలని బిజేపి గత రెండు మూడు ఏళ్లుగా మాధవీలత ద్వారా ప్రయత్నాలు చేస్తుంది. ఇక్కడ భారాస పోటీ నామామాత్రమే.
ఇక మిగిలిన చేవెళ్ళ, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలలో, ఒకటి రేవంత్ రెడ్డి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నాదే కావడం, దాన్ని నిలబెట్టుకోవడం కూడా ముఖ్యమే కావడంతో మల్లగుల్లాలు పడుతున్నారు.

ఇక సికింద్రాబాద్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి, బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పోటీ చేస్తుండగా, అతనికి పోటీగా, హైదరాబాద్ లో ఖైరతాబాద్ నుండి ఎమ్మెల్యే గా గెలిచిన, పూర్వ కాంగ్రెస్ నాయకుడు అయిన దానం నాగేంద్ర ను పార్టీలో చేర్చుకొని మరీ ఆ టిక్కట్టు ఇచ్చారు. అలాగే, జి హెచ్ ఎం.సి లో పట్టు సాధించడానికి ఇప్పటికే డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డిని కాంగ్రెస్ లో చేర్చుకొన్నారు.
ఇప్పుడు ఇక మేయర్ ను చేర్చుకోవాడమే మిగిలింది. భారాస సెక్రెటరీ జనరల్ కూతురు, ఆ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న ఏకైక బలహీన వర్గాల నాయకుడు, పూర్వ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి, ఇప్పటి రాజ్య సభ సభ్యుడు కె. కేశవరావు కూతురు, జి హెచ్ ఎం సి మేయర్ గద్వాల విజయాలక్ష్మిని పార్టీలోకి ఆహ్వానించడానికి కేంద్ర నాయకులు, రాష్ట్ర ఇంచార్జ్ దీపా మున్షి స్వయంగా ఆమె ఇంటికి వెళ్ళడం, వారికి ఇస్తున్న ప్రాధాన్యత, భారాస పార్టీ ని నైతికంగా దెబ్బ తీయడానికి చేస్తున్నప్రాయత్నాలను తెలుపుతుంది. ఇప్పటికే, చేవేళ్ళలో ఏకంగా, భారాస ఎం పి రంజిత్ రెడ్డిని పార్టీలోకి తీసుకొని, ఆయనకే మళ్ళీ ఆ స్థానాన్ని అప్పగించారు.

**కాంగ్రెస్ వృద్ధ నాయకుల కట్టడి**

కాంగ్రెస్ లోని వృద్ధ నాయకులను కట్టడి చేసే క్రమంలో పార్టీ అధ్యక్షునిగా,ముఖ్యమంత్రిగా తన చాణక్యతను, దక్షతను చూపుతూ, కొత్త వర్గాన్ని సృష్టించడంలో రేవంత రెడ్డి నిర్విరామా కృషి చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది. మహబూబ్ నగర్, ఖమ్మం సీట్లలో ఉన్న ఆస్పష్టతను తొలగించుకొని, తన వారైన వారికే, తనతో మాత్రమే ఉండే వారికి ప్రాధాన్యత ఇస్తూనే, పార్టీ కట్టుబాట్ల మేరకే తాను వ్యవహరిస్తున్నట్లు కనబడేలా, అందరినీ కలుపుకొని వెళు తున్నట్లు ప్రవర్తిస్తూ, తనఆధిపత్యం నిలుపుకోవడానికి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నట్లు పరిశీలకులు





## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నట్ ప్రయిట్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# గడియారం తో గుణపాఠం

శ్రీనివాస్, శ్రీనిధి దంపతులు చాలా అన్యోన్యంగా ఉండేవాళ్లు. వీరికి రాము, రమ్య అనే ఇద్దరు కవలలు. ఈ పిల్లలు ఐదవ తరగతి చదువుతున్నారు. వీరికి అమ్మ భక్తి, నాన్న చురుకుతనం రెండు గుణాలు ఉన్నాయి. వీరికి ఎదుటివారిని గౌరవించడం బాగా తెలుసు ఇంకా చదువులలో చురుకుతనం కూడా ఉంది.శ్రీనివాస్ ఒక పెద్ద కంపెనీకి మేనేజర్. తన కింద పని చేసే వారికి, క్లర్క్ కి ఎప్పుడు తిడుతూనే ఉంటూ పని చేయించుకుండే వాడు. శ్రీనివాస్ అంటే అందరికీ హడల్.
ఒకరోజు క్లర్క్ , సార్! నాకు లీవ్ కావాలి. తిరుపతికి వెళ్తాను అని అడిగాడు. అప్పుడు శ్రీనివాస్ ఇంకా నీకు జాబ్ ఎందుకు? రోజు క్షేత్రాలు తిరుగు అని బాగా మందలించాడు.
ఆ మరునాడు క్లర్కు శ్రీనివాస్ ఇంటికి వచ్చి శ్రీనిధి తో సార్ నాకు బాగా తిట్టారు అమ్మ, లీవ్ కూడా ఇవ్వలేదు అని బాధగా చెప్పుకున్నాడు. అయ్యో మరి తిరుపతి వెళ్లడం అవ్వలేదా అని ఆమె అడిగింది. ఆమెకి అసలే భక్తి ఎక్కువ. సరే రామన్న నేను సార్ కు చెప్పి నీకు సెలవు ఇచ్చేటట్లు చేస్తాను అని నెమ్మదిగా చెప్పి పంపింది.
ఆరోజు ఆదివారం అవ్వడంతో పిల్లలు శ్రీనివాస్ శ్రీనిధి అందరూ ఇంటి దగ్గరే ఉన్నారు. శ్రీనిధి రామన్నకి సెలవు ఇవ్వలేదు ఎందుకు నీకు భక్తి లేదు అని వాళ్ల



భక్తిని అగౌరవం చేయకండి అని కాస్త గట్టిగా చెప్పింది. ఇంతలో పిల్లలు రాము రమ్య మాకు నిన్న మంచి పాఠం చెప్పారు మా తెలుగు ఉపాధ్యాయులు. అది వినండి డాడీ అన్నారు. సరే చెప్పండ్రా అని తల్లి తండ్రి అన్నారు.
""గంటకొక తూరియే గానీ కదలదొకటి
తిరుగులేకుండా రేపవల్లు తిరుగును ఒకటి.
కానీ గంటల ముల్లునే కాంతు రెపుడు...""

గడియారంలో ఏ .గంటల ముళ్ళు,బి .నిమిషాల ముళు ్ళ,
సి .సెకండ్ల ముళ్ళు, ఈ మూడు సక్రమంగా తిరిగితేనే దానికి విలువ ఉంటుంది. ఒక రోజు సి.. బి.. ఏ తో ఇలా అంటుంది. మీరు ఎప్పుడు చూసినా నెమ్మదిగా తిరుగుతుంటారు. నేను రాత్రి పగలు గిరా గిరా కష్టపడి తిరుగుతూనే ఉంటాను. నేను తిరుగుతున్న సమయంలో మీరు హాయిగా నెమ్మదిగా ఉంటున్నారు ఎక్కడ లేని కష్టం నాదే కానీ, గంటల ముళ్ళు కే అందరూ చూస్తూ ఎక్కువ విలువనిస్తుంటారు అని బాధతో చెప్పుకుంది. అప్పుడు...ఏ, బి లు ఇలా అంటాయి. నీవు అంత కష్టపడి పని చేయడం వలన మనందరికీ విలువ ఉంది, లేదంటే గడియారాన్ని బయటికి విసిరేస్తారు అని చెప్పాయి. ఈ కథను తెలుగు మాస్టారు చాలా బాగా వివరించారు పిల్లలందరికీ మంచిగా నచ్చింది. అందుకే రాము చాలా సరదాగా వాళ్ళ నాన్నగారికి ఈ కథని చెప్పాడు.
అది విన్న శ్రీనివాస్ చాలా ఆనందపడ్డాడు. తన మనసులో ఇలా అనుకున్నాడు. తను ఆఫీసులో పని చేసే తోటి ఉద్యోగస్తులను, క్లర్కులను గౌరవిస్తాను. ఎవరు చేసే పని వారే చేయాలి. ప్రధానోపాధ్యాయులు బెల్ కొట్టడం, ప్యూన్ అందరిని అధికారంతో చెలాయించడం చేస్తే చాలా అసభ్యంగా ఉంటుంది అని శ్రీనివాస్ అనుకున్నాడు.
అప్పటినుండి తనలో చాలా మార్పు వచ్చింది. తన తోటి ఉద్యోగస్తులను, చిన్న పెద్ద తేడా లేకుండా గౌరవించడం నేర్చుకున్నాడు. ఒకరి పనిని ఒకరు గౌరవించడం నేర్పించాడు. అప్పటినుండి తన ఆఫీస్ నీ టాప్ పొజిషన్లో ఉండేటట్లు చేశాడు శ్రీనివాస్. అందుకే చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరి పనిని ఒకరు గౌరవించుకుంటే ఇల్లు, పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు మరియు ప్రభుత్వాలు కూడా నెంబర్ వన్ స్థానంలో కచ్చితంగా ఉంటాయి..

బళ్ల కృష్ణ వేణి
పలాస, శ్రీకాకుళం జిల్లా

## కవులకు గమనిక

ప్రజా మంటలు

ఇవి ఎన్ని"కల" రోజులు.
కవులు సమాజాన్ని కదిలించాలి. అందుకే,
ప్రజలను చైతన్యవంతం చేసే కవితలను
ఆహ్వానిస్తున్నాం.
మీ కవితలు ఎన్నికల అంశానికే పరిమితమై
సామాజిక అంశాలాను స్పృశిస్తూ,
10-15 లైన్లకు మించకుండా
ఈ కింది ఈమైల్ కు పంపండి.
mantalukathalu@gmail.com
వీటిని ప్రతిరోజూ "ప్రజా మంటలు"
తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రచురిస్తాం.

-ఎడిటర్

# జీవన్ రెడ్డిపై ఎంపి అరవింద్ తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

## టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి



**జగిత్యాల ఏప్రిల్ 01 ( ప్రజామంటలు):** రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ ఎలాంటి మచ్చ లేకుండా ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి , ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై ఎంపి ధర్మపురి అరవింద్ తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు . నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ సంచలనాల కోసమే మతి భ్రమించి రోహింగ్యా , బంగ్లాదేశ్ పేరుతో మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పిచ్చి పిచ్చిగా కామెంట్స్ చేస్తున్నారని , రాజకీయ జీవితంలో హుందాగా వ్యవహరించి తన చిల్లర మాటలను మానుకోవాలని హితవు పలికారు . ఎఐసిసి అధిష్టానం నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిని ప్రకటించడంతో తన ఓటమిని ముందే గ్రహించి ధర్మపురి అరవింద్ మతి భ్రమించి తన చిల్లర మాటలతో జీవన్ రెడ్డిపై రెచ్చగొట్టే విధంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారనీ విమర్శించారు . గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో 5 రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని బాండ్ పేపర్ తో ప్రజలను మోసం చేసిన అరవింద్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ చేత ప్రకటించిన పసుపు బోర్డు మంజూరు ఇంకా గేజిట్ పేపర్లకే పరిమితం చేసి ఏర్పాటు ప్రక్రియను ఆరు నెలలు కావస్తున్నప్పటికీ పసుపు బోర్డును ప్రారంభించడంలో తీవ్ర జాప్యం చేస్తూ రైతులను మభ్య పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారనీ ఆరోపించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ధర్మపురి అరవింద్ చెప్పే అబద్ధాలను, కల్లబొల్లి మాటలను నమ్మకుండా కోరుట్ల నియోజకవర్గ ప్రజలు తిప్పికొట్టి ఓడించారనీ, గత ఐదేళ్లలో ఎంపిగా ధర్మపురి అరవింద్ చేసిన అభివృద్ధి శూన్యమనీ, వచ్చే నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ధర్మపురి అరవింద్ కు ఓటమి తప్పదనీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనీ టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి తెలిపారు.

# 1098 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**గొల్లపల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** 1098 ఆధ్వర్యంలో గొల్లపెల్లి పరిధిలోని అంగన్వాడీ సిబ్బంది,గర్భిణీ మహిళలు,కిషోర్ బాలికలకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ నర్సింగ రాణి హాజరై గ్రామీణ ప్రాంతాల్లో మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలను వారికి వివరించారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను తెలిపారు. గర్భిణీ స్త్రీలు,చిన్న పిల్లల తల్లులు పాటించాల్సిన జాగ్రత్తలను తెలియచేశారు. మితమైన,తీవ్రమైన పోషకాహారం వల్ల ఎదురయ్యే సమస్యలను అర్థమయ్యే రీతిలో తెలియచేశారు. తర్వాత అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేసిన పిల్లల ఎత్తు ,బరువు, పౌష్టికాహార పంపిణీ ,గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్టర్ లను పరిశీలించారు. పిల్లల,పిల్ల తల్లుల బరువు నమోదు వివరాలని నిశితంగా పరిశీలించి, గ్రోత్ కార్డ్స్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రం నుండి పంపిణీ చేసే గుడ్లు, బాలమృతం సరైన సమయంలో అందించాలని ఆజ్ఞాపించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు 1098 హెల్ప్ లైన్ సిబ్బంది రజిత, మానస, అంగన్వాడీ సూపర్వైజర్ మమత, అంగన్ వాడి సిబ్బంది, గర్భిణిలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# అడ్లూరి జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు



**జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదినం పురస్కరించుకొని స్థానిక శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ దేవాలయం లో ధర్మకర్తల మండలి అధ్వర్యంలో దేవాలయ అర్చకులచే ఉదయం అభిషేకం,అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, శ్రీ లక్ష్మి నరసింహా స్వామీ వార్ల ఆశీర్వాదం తో శాసనసభ్యులుగా ఎన్నికైన ఆడ్లూరి లక్ష్మణ్ భవిష్యత్ లో ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతున్ని కోరుకుంటూ వారికి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో వేముల రాజేష్, వోజ్జల లక్ష్మణ్, గుడ్ల రవి, రమణ, శ్రావణ్ మరియు ఉత్సవ కమిటీ సభ్యులు స్తంబంకాడి గణేష్, మాదాసు మల్లేష్, నేదునూరి శ్రీధర్, కోమిరెల్లి పవన్ మరియు తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంప్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికైన వెంకటేశ్వరరావు ని అలాగే కార్యవర్గ సభ్యులను సన్మానించిన జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

## విరించిన విరబూసిన అక్షర కుసుమం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్, ధర్మపురి శాసన సభ్యులు

**జగిత్యాల ఏప్రిల్ 01 ( ప్రజామంటలు)**



ఆపదలో ఆప్తుడిలా ...
బాధల్లో బంధువులా ...
రాష్ట్ర ప్రజలకు
దిక్సూచి వై మందుకు
నడుస్తూ ...
ప్రజలను నడిపిస్తున్న
అన్నగారు

ఉప్పొంగిన ఉత్తేజంతో
మందుకు సాగాలని
మనసారా కోరుకుంటూ ....

రాబోయే రోజుల్లో మరెన్నో అందమైన, అద్భుతమైన,
ఆనందకర జన్మదిన వేడుకలు
ఘనంగా జరుపుకోవాలని మనసారా కోరుకుంటూ....
అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నగారికి
జన్మదిన శుభాకాంక్షలతో .....

తుమ్మనపెల్లి రాజేంద్ర ప్రసాద్
లెక్చరర్ బి ఎడ్ కళాశాల,
తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
బిసి యువజన సంఘం తెలంగాణ



**మొక్కులు తీర్చుకున్న భక్తజనావళి:**
పరమ పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించిన భక్తులు, సుప్రభాత దర్శనానికి వివిధ ఆలయాల ముందు బారులుతీరి నిలుచున్నారు. కోరిన కోర్కెలు తీర్చే వరదుడుగా వినతికెక్కిన ఉగ్రనారసింహునికి ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఒక కనుములో కొబ్బరికాయ, ఖర్జూరపు పండ్లు, పోకలు, మొక్కులు కలిపి కట్టి లక్ష్మీ సమేత నార సింహుని సన్నిధిలో ఉంచడం ద్వారా కోర్కెలన్నీ నెరవేరగలవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ క్రమంలోనే సోమ వారం అత్యధిక సంఖ్యలో భక్తులు ఆలయంలో ముడుపులు కట్టి, వల్లు బండ, గండాదీపాది మొక్కులు తీర్చుకున్నారు.

**ఆంజనేయ సన్నిధిలో భక్తజనం:**
దీక్షాపరులైన భక్తులతో ఆంజనేయ ఆలయం కిటకిటలాడింది. ఇటీవలి కాలంలో ధర్మపురి క్షేత్రస్థ దేవస్థానం లో సాంప్రదాయ రీతిలో హన్మాన్ దీక్షలను స్వీకరిస్తున్న నేపథ్యంలో, చైత్ర పౌర్ణమి హన్మాన్ జయంతిని పురస్క రించుకుని, 21రోజుల పాటు ఆచరించే దీక్షలలో భాగంగా, సోమ వారం పెద్ద సంఖ్యలో ప్రత్యేక హన్మాన్ అర్ధ మండల దీక్షలను స్వీకరించేందుకై అరుదెంచి, పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలను ఆచరించి, పునీతులై, శ్రీలక్ష్మీ నరసింహ దేవ స్థానాంతర్గత ప్రసన్నాంజనేయ ఆలయం ముందు దైవదర్శనార్థం బారులుతీరి వేచి ఉన్నారు. దేవ స్థానం ఎసి, ఈఓ శ్రీనివాస్, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ శర్మ, ఆలయ అర్చకులు వొద్దిపర్తి నర్సింహమూర్తి, కళ్యాణ్ ఆధ్వర్యంలో అంజనీ తనయునికి ప్రత్యేక అభిషేకాలు, నిత్యవిధి పూజలు, అర్చనలు నిర్వహించారు.

# దామెర గ్రామంలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠ కు భూమి పూజ



**ఎల్కతుర్తి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఆరే కుల సంఘం నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా విగ్రహ కమిటీ చైర్మన్ మోరె బాపురావు మాట్లాడుతూ ఆరేకుల సంఘం ఇష్టదైవంగా భావించే ఛత్రపతి శివాజీ విగ్రహం దామెర గ్రామంలో ఏర్పాటు చేయడానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని తెలిపారు. విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి భూమిని మోరె రవి,మోరె బాపురావు ఇచ్చి నందుకు అర్ కుల సంఘం దామెర గ్రామ అధ్యకుడు ఇరువాల మల్లయ్య కుల సంఘం తరపునుండి కృతజ్ఞతలు తెలియజేశారు. హన్మకొండ జిల్లా కార్యదర్శి అంబిరు శ్రీనివాస్,విగ్రహ కమిటీ ఉపాధ్యక్షులు వరికెల రాజేశ్వర్ రావు, కరట్లపల్లి నగేష్, వరికెల కృష్ణ,మురాల శ్రీనివాస్, వరికెల దామోదర్, మోరే రవీందర్, వరికెల బాపూరావు,గ్రామ శాఖ అధ్యక్షులు ఇరువాల మల్లయ్య, ఉపాధ్యక్షులు ఆధార్ సంది శ్రీనివాస్, మాచన పల్లి రాజు,కరట్లపల్లి భూపతి, మాజీ సర్పంచ్ చల్ల రవీందర్ రెడ్డి, కదారి భిక్షపతి, కొమ్మిడి మహిపాల్ రెడ్డి,సాతురి భాస్కర్, చంద్రమౌళి, ప్రభాకర్, మంతుర్తి శ్రీకాంత్, మంతుర్తి సమ్మయ్య, రమేష్, ఆరె కుల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# దేవాదుల నీటి పట్టాన్ని పరిశీలించిన ఎల్కతుర్తి, భీమదేవరపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు




**ఎల్కతుర్తి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని రాష్ట్రంలో ఎన్నడూ లేని స్థాయిలో కరువు ఛాయలు ఏర్పడ్డాయని దీనివల్ల రైతులు ఇబ్బంది పడక తప్పడం లేదని ఎల్కతుర్తి భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి చిట్టెంపల్లి ఐలయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు సోమవారం సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి సూచన మేరకు రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ధర్మసాగర్ మండలంలోని దేవాదుల ఉత్తర కాలువ తూము దగ్గర నీటిమట్టాన్ని పరిశీలించారు అక్కడే దేవాదుల డిఈ ప్రశాంతి ఏఈ అరవింద్తో మాట్లాడి నదిలో నీటిమట్టం తక్కువగా ఉన్న మోటార్లు ఆఫ్ చేశారని తెలుసుకున్నారు అనంతరం అక్కడే పాత్రికేయుల సమావేశంలో మీరు మాట్లాడుతూ వర్షపాతం ఈ సీజన్లో ఒకేరోజు నమోదు కావడంతో అటు ప్రాజెక్టుల్లో త్వరగా నీటిమట్టం తగ్గిపోయిందని గతంలో ఎన్నడు కూడా ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని పేర్కొన్నారు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడంతో నీటి పంపింగ్ సాధ్యం కాక ఎల్లమిడిలో కూడా నీరు తక్కువగా ఉందన్నారు ఇదే కాకుండా గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం దేవాదుల మూడో పేజీ పనులను సరైన టైంలో పూర్తి చేయకపోవడం వల్ల జలాశయాల్లోకి రైతులకు అవసరం పడే స్థాయిలో నీటిని పంపించేసుకోలేక పోయామని విమర్శించారు అదేవిధంగా వ్యవసాయ రంగానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ నుంచి బిజెపి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందరం లేదని ఆరోపించారు రైతు సంఘాన్ని ఆదుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకు వెళు తుందని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందించాలని డిమాండ్ చేశారు ప్రస్తుతం నెలకొన్న దుర్భర పరిస్థితులను రైతులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సంతాజి కేత్రి లక్ష్మారెడ్డి, కొలుగూరి రాజు, ఎల్కతుర్తి మాజీ సర్పంచ్ గొడిశాల యాదగిరి గౌడ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# మెట్ పల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**మెట్ పల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎస్పీ పరిశీలించి సిబ్బంది పని తీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల వివరాలను రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని,బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చునని అన్నారు. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం లో ఎన్నికల నిర్వహణకు ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్ లు నిర్వహించి ఓటర్ల కు భద్రతా భావాన్ని కలిగించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నేరస్తుల, రౌడీ షీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. అదికారులు, సిబ్బంది సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డయల్100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం అందించాలని సూచించారు. ప్రజలకు సైబర్ నేరాల పట్ల, సైబర్ నేరగాలు చూపే మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని తెలిపారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు చేసిన లేదా అల్లర్లను సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ఓటర్లను ప్రభావితం చేసే ఎన్నికల నేరస్థులపై, రౌడీ షీటర్ల పై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని,వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని,అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఉమామహేశ్వర రావు ,సి.ఐ నవీన్, ఎస్.ఐ చిరంజీవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్



**మల్యాల ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మల్యాల కేంద్రంలో జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ వంటి కవాతును అడిషనల్ ఎస్పీ భీమ్ రావు ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ జెండా ఊపి ప్రారంబించారు. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం లో ఎన్నికల నిర్వహణకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ,డిఎస్పీ రఘుచందర్, సి.ఐ రవి, ఆర్ ఐ వేణు, ఎస్.ఐ రహీం సిఐఎస్ఎఫ్ అదికారులు, పోలీస్ సిఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి


### 8వ తరం వంశస్థులకు ఘన స్వాగతం పలికిన విశ్వ బ్రాహ్మణ కుల బంధువులు

**జగిత్యాల ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రానికి విచ్చేసిన శ్రీ జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 8వ తరం వంశస్థులు సోమవారం ఉదయం 11 గంటలకు శ్రీ వీరభద్ర స్వాముల వారు వారి ధర్మపత్ని లక్ష్మీ భ్రమరాంబిక వారు జగిత్యాల పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయానికి విచ్చేసిన సందర్భంగా ఘనంగా మంగల వాద్యాలతో మహిళలు కోలాటలాడుతూ ఘనంగా ఆలయానికి స్వాగతం పలికాడు అనంతరం ఆలయంలోని మూలవిరాట్ అయిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు అనంతరం "గురుదేవులు శ్రీ వీరభద్ర స్వాముల వారిని" విశ్వబ్రాహ్మణ కుల బాంధవులు, భక్తులు తదితరులు దర్శించుకుని ఆశీర్వాదాన్ని తీసుకున్నారు.





ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



**ఎన్డిఏ బిజెపి, టిడిపి, జనసేన, ఉమ్మడి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ**

కుటుంబ సమేతంగా కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి విచ్చేసిన సందర్భంగా అక్కడ ఉన్న అర్చకులు వారికి స్వాగతం పలుకుతూ వారికి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, మరియు బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనగుంది విజయలక్ష్మి , వనగుంది కిరణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిఎం మహేష్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి, హేమంత్ ,ముస్తూరు భాస్కర్ , ముస్తూరు వేదవతి , ముష్టురు అభిషేక్, మరియు బిజెపి నాయకులు, టిడిపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## వర్షకొండ దేవాలయాలలో దేవతల పుస్తెలతాడులు చోరీ

**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** వర్షకొండ దేవాలయాలలో గుడి తాళములను పగలగొట్టి 3.5 గ్రాముల బంగారము దొంగిలించిన దొంగలు. మండల పరిధిలోని వర్షకొండ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కుడుముల రాకేష్ పోలీస్ స్టేషన్ కి వచ్చి తేదీ 31.03.2024 అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వర్షకొండ లో గల వెంకటేశ్వర స్వామి టెంపుల్, బ్రహ్మంగారి టెంపుల్, పెద్దమ్మ గుడి మరియు పంచముఖ హనుమాన్ దేవాలయంలోని గుడి తాళాలు పగలగొట్టి వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని సీతమ్మ వారి యొక్క బంగారు పుస్తెలతాడు 2 గ్రాములు మరియు బ్రహ్మంగారి గుడిలోని గోవిందమ్మ యొక్క బంగారు పుస్తెలతాడు 1.5 గ్రామ్స్ దొంగిలించినారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఏ. అనిల్ తెలిపినారు.



## బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులకు సన్మానం

**మెట్ పల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** ఇటీవల ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలకు అధికారులుగా వ్యవహరించిన మగ్గిడి వెంకట నర్సయ్య, సోమా భూమేశ్వర్, కోటగిరి వెంకటస్వామి, పసునూరి శ్రీనివాస్, నల్ల రాజేందర్ లు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించారని అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి కొనియాడారు. సోమవారం ఎన్నికల అధికారుల నుండి చార్జ్ తీసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలాంటి ఘర్షణ మరియు అవాంచనీయ సంఘటనలు లేకుండా అధికారులు ఎన్నికల ఫలితాలు వెలువడించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ బాడీ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తునికి వేణు గోపాల్, ఉపాధ్యక్షుడు ఎల్మల రాంబాబు, సంయుక్త కార్యదర్శి రాంపల్లి జగన్, క్యాషియర్ రాజేష్ శెట్టి, కోట రాజారెడ్డి, కాజీపేట స్రవంతి, ఒజ్జెల శ్రీనివాస్, సురభి అశోక్, మన్నె గంగాధర్, వాల్గోట్ మహేష్, గుమ్మడి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## జగిత్యాల జిల్లాలో షార్ట్ ఫిలిం సందడి

**గొల్లపెల్లి ఏప్రిల్ 01 ( ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామ నివాసి రాజ రాంమోహన్ రెడ్డి స్వీయ దర్శకత్వంలో మన పల్లె టాలెంట్ నిర్మిస్తున్న మన ఉగాది షార్ట్ ఫిలిం ను కళాశ్రీ అధినేత గుండేటి రాజు క్లాప్ కొట్టి ప్రారంభించి మాట్లాడుతూ.... మన జిల్లాలో షార్ట్ ఫిలిమ్స్ తో కళాకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఇది శుభ పరిణామం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నటీనటులు రాజా రామ్ మోహన్ రెడ్డి, రజని, గెటప్ శ్రీనివాస్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



## టీఎన్జీవోలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**జగిత్యాల ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో టిఎన్జిఒ సంఘం జగిత్యాల జిల్లా శాఖ వారిచే ఏర్పాటు చేయబడిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీమతి షేక్ యాస్మిన్ భాష ప్రారంభించినారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేస్తున్న ఉద్యోగులకు మరియు ప్రజలకు, సందర్శకులకు అందరికీ ఎండాకాలంలో చల్లని నిటిని అందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షేక్యాస్మీన్ బాషా మాట్లాడుతూ టీఎన్జీవో సంఘం సేవా కార్యక్రమాలు చేయటంలో ఎప్పుడూ ముందుంటుందని, ఉద్యోగులందరికీ ఎప్పుడు అండగా ఉంటుందని, ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి మరియు వారి జిల్లా కార్యవర్గానికి కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి హన్మంతరావు, వహీదుద్దీన్, మెప్మా ఎఒ శ్రీనివాస్, టీఎన్జీవో నాయకులు సాహెద్ బాబు, రవీందర్, రాజేందర్, రవికుమార్, రాములు, సుగుణాకర్, వెంకట పవన్, ప్రమోద్, ఇంద్రజ, మౌనిక, పుష్పలత, శరత్, మహేష్, భాస్కర్,శంకర్, మురళి, కిరణ్, మహేష్, వంశి, నర్సయ్య, గీత, అరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు.





## ప్రైవేట్ హాస్టల్స్ లో మూమెంట్ రిజిస్టర్ ఉంచాలి

### నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్టల్స్ మూసివేయాలి

**జగిత్యాల ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** జిల్లాలో నడుస్తున్న ప్రైవేట్ హాస్టల్స్ లో మూమెంట్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా మహిళ అధ్యక్షురాలు గంగం జలజ డిమాండ్ చేశారు. జిల్లాలో ఇంటర్, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో చాలా హాస్టల్స్ నడుస్తున్నాయని ఇందులో కొన్ని అనిమతి ఉండి కొన్ని అనుమతి లేకుండా నడిపిస్తున్నారని తెలిపారు. చాలా హాస్టల్స్ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థులపై ఎలాంటి నియంత్రణ లేకుండా ఇష్టానుసారం నడిపిస్తున్నారని తెలిపారు. చాలా హాస్టల్స్ విద్యార్థుల మూమెంట్ రిజిస్టర్ ఏర్పాటు చేయకుండా సెక్యూరిటీ గార్డు లేకుండా ఇష్టానుసారం నడిపిస్తున్నారని దీని వలన కొంత మంది విద్యార్థులు అడిగేవారు లేరని అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. చాలా ప్రైవేట్ హాస్టల్స్ వ్యాపార దృక్పథంతో నడిపిస్తున్నారే తప్ప విద్యార్థుల రక్షణ పై ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదని అన్నారు. ఇకనైనా అధికారులు ప్రైవేట్ హాస్టల్స్ పై నిఘా ఏర్పాటు చేసి హాస్టల్స్ ఏర్పాటు అనుమతి ఇచ్చేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని కోరారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్టల్స్ మూసివేయాలని అట్టి నిర్వాహకులపై క్రిమినల్ తీసుకోవాలని కోరారు.



## నమస్తే తెలంగాణ బ్యూరో ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించిన పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



**తంగళ్ళపల్లి ఏప్రిల్ 01 ( ప్రజామంటలు):** సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మం. చీర్లవంచ, నాయినివారిపల్లి గ్రామ వాస్తవ్యులు కరీంనగర్ నమస్తే తెలంగాణ బ్యూరో ఇంచార్జ్ కడపత్రి ప్రకాష్ రావు తల్లి సావిత్రి గారు గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో వారి మృతి చెందగా సోమవారం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించిన మాజీ మంత్రి పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ , పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఓరుగంటి రమణారావు తదితరులు పాల్గొన్నారు.




## సరైన ధ్రువపత్రాలు లేక రూ. 1,33,000 సీజ్

### సిఐ రామ్ నర్సింహారెడ్డి

**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం వద్ద గల అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద రామ్ నర్సింహా రెడ్డి సిఐ ధర్మపురి,ఎస్సై వెల్గటూర్ సిబ్బందితో కలిసి రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా వాహనాల తనిఖీ చేస్తుండగా ఒక కారులో 1,33,000 రూపాయలు ఎలాంటి సరైన ధ్రువపత్రాలు లేనందువల్ల సీజ్ చేసి సంబంధిత 1,33,000 రూపాయలు అధికారులకు అప్పగించడం జరిగినది. అని సి ఐ ఏ. రాంనర్సింహారెడ్డి ధర్మపురి తెలిపారు.

## ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోండి

### జగిత్యాల జిల్లా చైర్ పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి

**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 ( ప్రజామంటలు):** మార్చి 31 జగిత్యాల పట్టణ కేంద్రంలోని ఓం సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చైర్ పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి కోరారు. ఈ మేరకు ఓం సాయిరాం హాస్పిటల్ లో మార్చి 31 ఆదివారం రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ఉచిత సేవలను ప్రారంభించారు. అనంతరం ఓం సాయిరాం వైద్యులు కంభం రూపేష్ మాట్లాడుతూ.... తమ హాస్పిటల్ లో నేటి నుంచి రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభమైన వి అని వీటిని తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా తమ హాస్పిటల్ లో ఎమ్మెస్ ఆర్ తో, జనరల్ సర్జన్, ఓయమ్ ఎఫ్ ఎస్, యూరాలజీ, జనరల్ మెడిసిన్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్ పర్సన్ దావ వసంతం - సురేష్, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి– లక్ష్మణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణి, వైద్యులు కంభం రూపేష్, కంభం మౌనిక, సందీప్ మోహన్, గంగాదేవి అనిల్, అంజయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## జగిత్యాలలో జోరుగా హైటెక్ వ్యభిచారం

**జగిత్యాల ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలో హైటెక్ వ్యభిచారం జోరుగా కొనసాగుతుంది. అందమైన యువతులు, మహిళల ఫొటోలను దళారులు వాట్సాప్ స్టేటస్ గా పెట్టి యువతను ఆకర్షిస్తున్నారు. కేవలం తమకు తెలిసిన వ్యక్తుల ద్వారా ఈ హైటెక్ వ్యభిచారం నడిపిస్తున్నట్లు సమాచారం. పోలీస్ అధికారులు ఇలాంటి దళారులపై నిఘా పెట్టినట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



## ఉగ్రనారసింహునికి భక్తజన నీరాజనం

(రామ కిష్టయ్య సంగన భట్ల)

**ధర్మపురి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** గోదావరీ తీరస్థ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో సనాతన సంప్రదాయ రీతిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన సోమవారం జరిగిన శ్రీ ఉగ్రనార సింహుని ఏకాంతోత్సవ వేడుకలకు అశేష భక్తులు విచ్చేశారు. ఉదయాత్పూర్వం ఉగ్ర లక్ష్మీ నారసింహ ఆలయాన్ని తెరవగా, సంప్రోక్షణం చేసిన అనంతరం దేవస్థానం యాజ్ఞికులు పురుషోత్తమా చార్య, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ శర్మ, ముత్యాల శర్మ, ముఖ్య అర్చకులు శ్రీనివాసాచార్య, నరసింహమూర్తి, అరుణ్, వంశీ, దేవస్థానం ఎసి,ఇఓ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యుల పర్యవేక్షణలో, భక్తుల గోత్రనామ యుక్త పూజలు, నిత్య అర్చనలు, నిత్య కళ్యాణంతో పాటు ఉత్సవ ముగింపు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ముఖ చిత్రాన్ని ముద్రించాలి

### తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చెప్యాల ప్రకాష్

**భీమదేవరపల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):**



ఆర్.బి.ఐ ఏర్పడి 89 సంవత్సరాల సందర్భంగా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పాటులో బాబాసాహెబ్ అంబేద్కర్ పాత్ర ఎంతగానో వుందని, ఆర్బిఐ ద్వారా ముద్రించి నోట్లపై అంబేద్కర్ ఒక చిత్రాన్ని ముద్రించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ, 1923 లో ద ప్రాబ్లం ఆఫ్ రూపీస్, ఇట్స్ ఒరిజిన్ అనే పుస్తకం రాసారని అన్నారు. అంబేద్కర్ చేసిన ప్రతిపాదనల వల్లే రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా 1935 లో ఏర్పడిందని గుర్తు చేశారు. 1934 ఆర్.బి.ఐ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో కమిషన్ లోని సభ్యుల ప్రతి ఒక్కరి చేతిలో అంబేద్కర్ రాసిన గ్రంథం ఉందంటే రూపకల్పన లో డా. అంబేద్కర్ పాత్ర ఎంతుందో అర్ధం చేసుకోవచ్చని అన్నారు. దక్షిణ ఆసియాలోనే అర్ధశాస్త్రంలో మొట్టమొదటి పీహెచ్డీ చేసిన మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. తప్పకుండా డా.అంబేద్కర్ ముఖ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ అంబేద్కర్ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## గాంధీ ఆవరణలో గుర్తు తెలియని మహిళా డెడ్ బాడీ

**సికింద్రాబాద్, ఏప్రిల్ 01 (ప్రజామంటలు):**



గాంధీ ఆసుపత్రి ఆవరణలో మరో గుర్తు తెలియని మహిళా డెడ్ బాడీ వెలుగు చూసింది. చిలకలగూడ ఎస్ఐ పి.కిషోర్ కథనం ప్రకారం..గత నెల 29న గాంధీ ఆసుపత్రి ఓపీ బ్లాక్ వేయిటింగ్ హాల్ వద్ద కింద పడి ఉన్న 60%--%65 ఏండ్ల వయస్సు కలిగిన మహిళా డెడ్ బాడీని చూసిన ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో ఎలాంటి వివరాలు లభించకపోవడంతో డెడ్ బాడీని మార్చురీకి తరలించి, భద్రపరిచారు. మృతురాలు యాచకురాలిగా భావిస్తున్నారు. గుర్తు పట్టిన వారు చిలకలగూడ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఎస్.ఐ. కోరారు.

## ముల్కనూర్ సహకార సంఘంలో ధాన్యము కొనుగోలు కేంద్రం ప్రారంభం

**భీమదేవరపల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):**



ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటి లిమిటెడ్ పారబాయిల్డ్ రైస్ మిల్లు ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి మాట్లాడుతూ, గ్రేడ్ ఏ రకానికి రూ. 2203 అని, కామన్ రకానికి రూ. 2183 అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యం.డి అఫ్జల్ పాష, సహాయ వ్యవసాయ అధికారులు ప్రశాంత్, కమలాసన్, సంగ శ్రీనివాస్, మిల్లు మేనేజర్ జి. అభిలాష్ రెడ్డి, సంఘ అధికారులు పాల్గొన్నారు.

## గ్రానైట్ డస్ట్ వల్ల నానా అవస్థలు పడుతున్న రైతు కూలీలు, గీత కార్మికులు

**ఎల్కతుర్తి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):**



ఎల్కతుర్తి లో గ్రానైట్ డస్ట్ తో ప్రయాణికుల అవస్థలు.రోడ్డు వెంట కారిపోయిన డస్ట్ ను కూలీలతో తొలగిస్తున్న యజమానులు. వారం నుండి ఇదే పరిస్థితి. గీతా కార్మికులు వ్యవసాయ రైతు కూలీలు వ్యవసాయ బావుల కాడికి వెళుతుండగా డస్ట్ రోడ్డుపైన ఉండడం వల్ల డస్ట్ కళ్ళల్లో పడడం వల్ల బండ్ల మీద వెళ్లే ప్రయాణికులకు యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ధర్నాలు చేసినప్పటికీ అధికారులు నామ మాత్రంగా చెప్పి వదిలేస్తారు. ఎన్నడు కఠిన చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతు కూలీలు, గీతా కార్మికులు ముక్త కంఠముతో కోరుతున్నారు.

## వేసవిలో వడదెబ్బ తీవ్రతపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### వంగర పిహెచ్ఎస్సి వైద్యాధికారి డా. రుబీనా

**భీమదేవరపల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):**



మండలంలోని వంగర గ్రామంలో వడదెబ్బ తగలకుండా గ్రామస్తులకు సలహాలు, సూచనలు వంగర పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ రుబీనా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వడదెబ్బ తగిలిన వ్యక్తిని నీడ ప్రదేశంలో ఉంచి, చల్లటి నీటితో తూడువాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీరు లేదా ఓఆర్ఎస్ సాగించాలని అన్నారు. అత్యవసరమైతే అంబులెన్స్ 108 ద్వారా సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. సబ్ సెంటర్ కేంద్రాలలో ఏఎన్ఎం, ఆశా వర్కర్ల దగ్గర ఉచిత ఓఆర్ఎస్ ప్యాకెట్లు లభిస్తాయని తెలిపారు. తప్పనిసరి పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ, తెల్ల రుమాలు ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.ఎన్ స్వామి, విమల, స్వరూప, స్వరూపారాణి గ్రామస్తులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ పోయినది..

## తగిన పారితోషికం ఇవ్వబడును

**జగిత్యాల ఏప్రిల్ 01 (ప్రజామంటలు):**

మిత్రులకు, శ్రేయోభిలాషులకు నమస్కారములు. ఎల్లాల రాజేందర్ రెడ్డి వార్త జగిత్యాల జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఫోను శుక్రవారం తేదీ 29/3/2024 న రాత్రి 11 గంటలకు వార్త ఆఫీస్ పాత బస్టాండ్ మున్సిపల్ కాంప్లెక్స్ వర్క్ పూర్తయిన తర్వాత వన్ టౌన్ పోలీస్ స్టేషన్, ఎస్బిఐ బ్యాంకు, జంబిగడ్డ నుండి అశోక్ నగర్ ఇంటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో స్యాం సంగ్ గెలాక్సి ఎ 51 బ్లాక్ కలర్ ఫోన్ పడిపోయినది. ఎవరికైనా దొరికితే 99487 02555, 89856 27552 నెంబర్ల కు దయచేసి ఫోన్ చేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

## రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది

### సాగునీరు అందక కన్నీళ్లు పెడుతున్నారు - రైతులను పరామర్శించని మంత్రులు

### మాజీమంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,ఏప్రిల్1 (ప్రజామంటలు):**



రాష్ట్రంలో రైతుల పరిస్థితి చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు పంటలు తగులబెట్టుకుంటుంటే బాధ కలుగుతుందన్నారు. రైతులకు వ్యతిరేకం గా మంత్రి తుమ్మల మాట్లాడటం బాధకలిగిందని వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కష్టపడి సాగుచేసిన రైతు తన పొలాన్ని తగులబెట్టుకునే దుస్థితి దాపురించిందన్నారు. కాంగ్రెస్ మంత్రులు, నేతలు రైతుల దగ్గరికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. రైతుల దగ్గరికి వెళ్లే ధైర్యం కాంగ్రెస్ మంత్రులు, నేతలకు లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అదనంగా ఏదో వస్తుందని ఆశపడ్డామని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. హోల్‌సేల్‌గా కాంగ్రెస్ మోసం చేస్తుందనుకోలేదని బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఆత్మవంచన చేసుకొని ఎందుకు మాట్లాడు తున్నారని ప్రశ్నించారు. మంత్రిని చూస్తే జాలేస్తున్నదని, ఎవరిని మెప్పించడానికి పాట్లుపడు తున్నారని అడిగారు. ఉద్యమం సమయంలో చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి సీఎంలుగా ఉన్నపుడు వాళ్ల దృష్టిలో పడటానికి కేసీఆర్‌ను ఇంతకంటే ఎక్కువగా తిట్టారని విమర్శించారు. తర్వాత కేసీఆర్ దగ్గరికి వచ్చి మంత్రివర్గంలో పనిచేసి ఇప్పుడు మళ్లీ పక్క పార్టీలోకి పోయి తిడుతున్నారని చెప్పారు. ఇలాంటివి ఎన్నో చూశాం, ఎంతో మందిని చూశాం.. అమావాస్య తర్వాత పౌర్ణమి వస్తుంది. అన్ని అమావాస్యలు మావి కావు, అన్ని పౌర్ణమిలు మీవి కావన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు చేసినవన్నీ తుమ్మలకు తెలుసన్నారు. చేతనైతే రైతు భరోసా రూ.15 వేలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. తాము చేసినదానికంటే రైతులకు ఎక్కువ మేలు చేయాలని సూచించారు. కేసీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద చల్లే దుర్బుద్ధే కనిపించిందని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వాలన్న సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. ఉత్తర తెలంగాణలో సగటుకంటే ఎక్కువ వర్షపాతం నమోదయిందని, దక్షిణ తెలంగాణలో వర్షపాతం కొంచెం తక్కువ ఉందని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనంత వదరగ గోదావరిలో గత వర్షాకాలంలో వచ్చిందన్నారు. అత్యధిక వరద వల్లనే మేడిగడ్డ బరాజ్‌లో రెండుమూడు పిల్లర్లకు నష్టం కలిగిందని చెప్పారు. ఇప్పుడు ఎత్తిపోస్తున్న నీళ్లే రెండు నెలల కింద ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు. కాంగ్రెస్‌కు పాలన చేతగాక మందిమీద నిందలు వేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నవాళ్లు మాటలతో ఎక్కువ రోజులు దృష్టి మరల్చలేరన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరువుకు కేరాఫ్‌గా కాంగ్రెస్ పాలన ఉండేదని, నిబద్ధత ఉంటే రైతు దశ మార్చవచ్చని కేసీఆర్ నిరూపించారని తెలిపారు. వ్యవసాయం చేయొచ్చని రైతులకు కేసీఆర్ భరోసా కల్పించారని చెప్పారు.

## ఆస్తి తగాదాలో తమ్ముడిపై అన్న దాడి

**కామారెడ్డి, ఏప్రిల్1 (ప్రజామంటలు):**



కామారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఆస్తి కోసం మానవ సంబంధాలను మరిచి తమ్ముడిపై అన్న, వదిన దాడి చేశారు. ఈ విషాదకర సంఘటన జిల్లాలోని దోమకొండ మండలం అంబారీపేటలో చోటు చేసుకుంది. ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ్ముడి క్షౌరశాలకి వెళ్లి మరీ కత్తితో దాడి చేశారు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కెరీర్‌లో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా

### ఉన్నత స్థాయికి రావాలని కలలు కన్నా

### విజయ్ దేవరకొండ ఇంటర్వ్యూలో చిరంజీవి



తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ వేడుకలు హైదరాబాద్‌లో జరిగాయి. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి నటుడు విజయ్ దేవరకొండ గెస్ట్‌లుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ చిరంజీవిని ఇంటర్వ్యూ చేశారు. కెరీర్‌లో ఆయన ఎదుర్కొన్న విమర్శలు, కుటుంబం గురించి పలు ప్రశ్నలు అడిగారు. దీనికి చిరు ఆసక్తికర జవాబిచ్చారు. కెరీర్ పరంగా ఈ స్థాయికి రావాలని ఎన్నో కలలు కన్నా. అయితే ఇప్పుడు నేను అనుభవిస్తున స్టార్‌డమ్ ఒక్కరోజులో మొదలైంది కాదు, ఒక్క రోజులో వచ్చింది కాదు. స్కూల్, కాలేజీ రోజుల్లో నాటకాలు వేసేవాడిని. అప్పట్లో బెస్ట్ యాక్టర్‌గా అవార్డు అందుకున్న రోజులున్నాయి. తోటి విద్యార్థులు నాపై ప్రశంసలు కురిపించేవారు. వారి మాటలు విని నేనెంతో గర్వపడేవాడిని. నటుడిగా మారాలనే బీజం అప్పుడే పడింది. సెలబ్రిటీ అయితే అందరూ మనల్నే చూస్తారని అర్థమైంది. దాని కోసం వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు అడుగులు వేశా. నా ఎదుగుదల వెనుక కష్టంతో పాటు జయాపజయాలు, విమర్శలు ఇలా చాలానే ఉన్నాయి. అవన్నీ దాటుకుని ఇప్పుడు ఈ హోదాలో ఉన్నా. కెరీర్‌లో తొలి అడుగులు వేసే సమయంలో.. మనం రాణించగలమా? లేదా అని బిక్కుబిక్కుమని ఉంటాం. అలాంటి సమయంలో సానుకూల వాతావరణం ఉన్న చోటే ఉండాలి. నేను అప్పటికి సినిమాల్లోకి రాలేదు. మద్రాస్‌లో ఉన్నప్పుడు స్నేహితుడితో కలిసి పాండిబజార్ వెళ్లా. అక్కడి వాళ్లు నన్ను చూసి.. ఏంటి సినిమాల్లో చేయడానికి వచ్చావా? హీరో అవుతావా?అని హేళన చేశారు. వాళ్ల మాటలు విని ఎంతో బాధపడ్డా. ఆ సంఘటన తర్వాత నేను మళ్లీ అక్కడికి వెళ్లలేదు. నెగెటివిటీ ఉన్న చోటికి వెళ్తే మనం మరింత కుంగుబాటుకు గురి అవుతాం. నా కుటుంబానికి నాన్నే ఫ్యామిలీస్టార్. ఒక కుటుంబాన్ని ఎలా చూసుకోవాలనే దాన్ని ఆయన నుంచే నేర్చుకున్నా. మా అమ్మకు ఐదుగురు చెల్లెళ్లు. మా తాతయ్య చనిపోయాక.. నాన్నే వారి బాధ్యత తీసుకుని వచ్చిన జీతంలోనే వారికి పెళ్లిళ్లు చేశారు. మా కుటుంబంలో ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగినా.. పలు సందర్భాల్లో అందరూ ఒకచోట కలిసేలా నేనూ సురేఖ ఎ÷-లాన్ చేస్తుంటాం. అలా కలవడం వల్ల మనలో ఉండే చిన్న చిన్న మనస్పర్థలు తొలిగిపోతాయని మా నమ్మకం. నేను మనసుకి ఆహ్లాదానిచ్చే చిత్రాలు చూస్తుంటా. చెబితే నవ్వుతారు కానీ.. నాకు 'మిక్కీ హౌస్' కామిక్ చిత్రాలు చూస్తా. జాకీ చాన్ చిత్రాలను ఎక్కువగా చూస్తాను. ÷మా ఇంట్లో వాళ్లు గదుల్లో లైట్స్ అన్నీ ఆన్ చేసి వెళ్లిపోతుంటారు. నేనే వాటిని ఆఫ్ చేస్తుంటా. వేడి నీళ్ల కోసం గిజర్ ఆన్ మర్చిపోతారు. వీటన్నింటికి సంబంధించి నా ఫోన్‌లో యాప్ పెట్టుకున్నా. చరణ్ ఉదయాన్నే బ్యాంకాక్ వెళ్లాడు. తన ఫ్లోర్‌లో లైట్స్ అన్నీ వేసి వెళ్లిపోయాడు. వాటన్నింటినీ నేను వెళ్లి ఆఫ్ చేశా. షాంపూ అయిపోతే ఆ బాటిల్‌లో నీళ్లు పోసి వాడుతుంటా. సోప్ చివరకు వచ్చాక.. చిన్న చిన్న ముక్కలన్నింటినీ ఒకటిగా చేసి వాడుతుంటా. దీన్నే మధ్యతరగతి మెంటాలిటీ అంటారు. మనిషికి పొదుపు చేయడం చాలా అవసరంఅంటే సరదాగా చెప్పేశారు.

## కలెక్షన్లలో దూసుకుపోతున్న టిల్లుస్క్వేర్



టాలీవుడ్ యువ హీరో సిద్దు జొన్నలగడ్డ కాంపౌండ్ నుంచి వచ్చిన ప్రాజెక్ట్ డీజే టిల్లు సీక్వెల్ ప్రాజెక్ట్ టిల్లు స్క్వేర్ ఇటీవలే దిడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకెళ్తుంది.

నరుడా డోనరుడా ఫేం మల్లిక్‌రామ్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం మార్చి 29న విడుదలై ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ఓపెనింగ్ వీకెండ్‌లో రూ.68.1 కోట్లు వసూళ్లు రాబట్టి.. రూ.50 కోట్ల క్లబ్‌లోకి ఎంటరయ్యే దిశగా వెళ్తుంది. మూడు రోజుల థియాట్రికల్ జర్నీలో కలెక్షన్ల విషయంలో నైజాం ఏరియా కీలక పాత్ర పోషించిందనే ట్రేడ్ విశ్లేషకుల అంచనా. ఆదివారం ఒక్కరోజే టిల్లు 2 నైజా ఏరియాలో రూ.3.30 కోట్లు రాబట్టింది. నైజాంలో మూవీ మొత్తం వసూళ్లు రూ.10.50 కోట్లు.. ఓ వైపు ఐపీఎల్ మేనియా కొనసాగుతున్నా ఓపెనింగ్ వీకెండ్‌లో రూ.10 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయి తన స్టామినా ఏంటో మరోసారి రుజువు చేస్తున్నాడు సిద్దు జొన్నలగడ్డ. టిల్లుకు మాస్ ఆడియెన్స్ ఏ రేంజ్ లో కనెక్ట్ అయ్యారో తాజా వసూళ్లు చెప్పకనే చెబుతున్నాయి. ఈ మేనియా ఇలాగే కొనసాగితే టిల్లు 2 అతి త్వరలోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి ఎంటరవడం పక్కా అని అర్థమవుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌తో అసోసియేట్ అవుతూ నిర్మించిన ఈ మూవీకి రామ్ మిర్యాల సంగీతం అందించాడు. ఈ చిత్రంలో మురళీధర్ గౌడ్, ప్రణీత్ రెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటించారు. ÷-లక్లైమాక్స్ షాకింగ్‌గా ఉండటమే కాదు.. ప్రేక్షకులంతా స్టన్ అవడం గ్యారంటీ అని సిద్దు ముందుగా చెప్పినట్టుగానే ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేసినట్టు ఇప్పటివరకు వచ్చిన టాక్ చెబుతోంది.

## సల్లూభాయ్-మురుగదాస్ కాంబో

## విలన్‌గా విద్యుత్ జమ్వాల్



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్లలో టాప్‌లో ఉంటాడు ఏఆర్ మురుగదాస్ ఈ స్టార్ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి సినిమా వస్తుందంటే అంచనాలు భారీగానే ఉంటాయి. ఈ స్టార్ డైరెక్టర్ బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ సినిమా పూర్తి చేసే కంటే ముందు మురుగదాస్ శివకార్తికేయన్‌తో చేస్తున్న ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సి ఉంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కానీ సల్లూభాయ్-మురుగదాస్ కాంబో సినిమాపై ఆసక్తికరవార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ విద్యుత్ జమ్వాల్ విలన్‌గా కనిపించబోతున్నాడట. ఒకవేళ ఈ వార్త నిజమైతే మురుగదాస్-విద్యుత్‌జమ్వాల్ కాంబోలో 12 ఏండ్ల గ్యాప్ తర్వాత రాబోతున్న రెండో సినిమా కానుంది. మరి మురుగదాస్-విద్యుత్ జమ్వాల్ కలయికలో రాబోతున్న సినిమా గురించి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. శాండల్‌వుడ్ రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో ఫే మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీలక్ష్మి మూవీస్ పై ఎన్వీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కోలీవుడ్ స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. గతేడాది టైగర్ 3 సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు సల్లూభాయ్.

## ప్రైవేట్ ఫంక్షన్‌లో స్టెప్పులేసిన రాజమౌళి



దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తెలుగు సినిమాను పాన్ ఇండియా లెవెల్‌కు తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుంది. అయితే, జక్కన్నలో మరో టాలెంట్ ఉందని ఇప్పుడే తెలిసింది. ఇటీవలే జరిగిన ఓ ఫ్యామిలీ ఫంక్షన్‌లో స్టెప్పులేసి అందరినీ ఆశ్చర్యపరిచారు అది కూడా తన భార్య రమా రాజమౌళితో కలిసి స్టేజ్‌పై సందడి చేశారు. 'ప్రేమికుడు' సినిమాలోని ఏఆర్ రెహమాన్ కంపోజ్ చేసిన 'అందమైన ప్రేమరాణి..' అంటూ సాగే హిట్ పాటకు అదిరేలా స్టెప్పులేసి అందరినీ




ఆకట్టుకన్నాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ డ్యాన్స్ వీడియో సినీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. జక్కన్న డ్యాన్స్ వీడియో చూసిన నెటిజన్లు, సినీ ప్రియులు 'మీలో ఈ టాలెంట్ కూడా ఉందా..?' అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇండస్ట్రీలో ఓటమి ఎరుగని దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రాజమౌళి.. బాహుబలి, ఆర్ఆర్ఆర్ లాంటి హిట్ సినిమాల తరువాత మహేశ్‌తో ఎంబి29 తో బిజీగా మారాడు. టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను పూర్తిచేసుకుంటోంది. రాజమౌళి ప్రతి సినిమాకు తన భార్య రమానే కాస్ట్యూమ్ డిజైనర్ అన్న విషయం తెలిసిందే.

## కిందికి లాగాలని ప్రయత్నించేవారూ ఉన్నారు



బాలీవుడ్‌లో ముక్కుసూటిగా మాట్లాడే నటీమణుల్లో రవీనా టాండన్ ఒకరు. తను అగ్ర నటిగా ఉన్ననాటి సమయం.. అప్పటి రాజకీయాలు.. బాలీవుడ్ సంప్రదాయాలు.. ఇలా పలు విషయాలపై తాజాగా ఓ ఛానెల్లో మాట్లాడారు. '90లలో నటీనటుల మధ్య పోటీ తీవ్రంగా ఉండేది. సెట్లో వాతావరణ ఆహ్లాదకరంగా ఉండేది. హీరోహీరోయిన్ల నటన, అ్గ÷ర్లు, వివాదాల గురించి చెప్పుకుంటూ ఒకర్నొకరు ఆట పట్టించుకునేవారు. అంతవరకైతే ఫర్వాలేదు. కొన్నిసార్లు ఇది శృతి మించి పోయేది. తమ కెరీర్ పట్ల అభద్రతా భావంతో ఉండేవాళ్లు, ఇతరుల విజయాన్ని ఓర్వలేకపోయేవాళ్లు కొందరు ఇతరుల్ని కిందికి లాగాలని ప్రయత్నించేవాళ్లు. దానికోసం వాళ్ల బాయ్‌ఫ్రెండ్ లేదా గర్ల్‌ఫ్రెండ్‌ని ప్రయోగించేవాళ్లు. పరిశ్రమలో పోటీ ఉండటం సహజమే కానీ ఇదేం పద్ధతి? గాసిప్స్, అనవసర రాజకీయాలతో పాపులర్ కావాలనుకోవడం ఏంటి? కొన్నిసార్లు ఇలాంటి పరిస్థితి నేనూ ఎదుర్కొన్నా. అయితే నాకు తెలిసి ఉద్దేశపూర్వకంగా ఎవరితో ఇలా ప్రవర్తించలేదు. ఎవరి మనసూ గాయపరచలేదు. ఎవరినీ సినిమాలోంచి తీసేయించాలని ప్రయత్నించలేదు. నాకు తెలియకుండా అలా జరిగితే క్షమాపణ చెప్పడానికి ఇప్పటికీ సిద్ధమే' అని చెప్పుకొచ్చారు.

# ఎంఎస్ ధోనీ ఇలా ఆడుతాడని అస్సలు ఊహించలేదు!



చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు అని సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. తీవ్రమైన గాయం నుంచి కోలుకుని వచ్చిన మహీ నుంచి ఇలాంటి ఆటతీరును ఊహించలేదన్నాడు. మునుపటి ధోనీని గుర్తుచేశాడని, మహీ షాట్లను తాను ఎంజాయ్ చేశానని ఫ్లెమింగ్ చెప్పుకొచ్చాడు. ఆదివారం విశాఖలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధోనీ.. ధనాధన్ షాట్లతో అలరించాడు. 16 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 37 పరుగులు చేశాడు. ఇందుకు సంబందించిన వీడియోస్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ అనంతరం సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాట్లాడుతూ%ా% 'ఎంఎస్ ధోనీ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. తీవ్రమైన గాయం నుంచి కోలుకుని వచ్చాక ఇలాంటి ఆట తీరును అతడి నుంచి నేను అస్సలు ఊహించలేదు. దూకుడైన బ్యాటింగ్‌తో ధోనీ అందరిని ఆకట్టుకున్నాడు. క్లిష్టమైన మ్యాచ్‌లోనూ మా జట్టుకు సానుకూల అంశం ఇదే. కేవలం ధోనీ వల్లే 20 పరుగుల తేడాతోనే మ్యాచ్‌ను కోల్పోయాం. పెద్ద టోర్నీలలో రన్‌రేట్ ఎంత ముఖ్యమో అతడికి తెలుసు. అందుకే ధోనీ దూకుడుగా ఆడాడు. ఈ ఓటమిపై మేం సమీక్షించుకుంటాం. ఛేదన ఆరంభంలోనే వెనుకబడ్డాం. బౌలింగ్‌లోనూ ఎక్కువగా పరుగులిచ్చాం. డేవిడ్ వార్నర్, రిషబ్ పంత్ దూకుడుగా ఆడారు. ఢిల్లీ భారీ స్కోరు చేయడానికి కారణం వారిద్దరే' అని తెలిపాడు.



## యార్కర్లతో విరుచుకుపడ్డ చెన్నై బౌలర్

చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో బ్యాటింగ్ విభాగంతో పాటు బౌలింగ్ విభాగం కూడా చాలా బలంగా ఉంది. అందుకు నిదర్శనం.. ఢిల్లీతో జరిగిన మ్యాచ్?లో చెన్నై ఫాస్ట్ బౌలర్ మతీషా పతిరణ తీసిన వికెట్లే. ఆ మ్యాచ్?లో పతిరణ యార్కర్లతో విరుచుకుపడ్డాడు. గంటకు 150 కి.మీ వేగంతో యార్కర్ బౌలింగ్ వేసి ఒకే ఓవర్ లో రెండు కీలక వికెట్లు తీశాడు. కళ్లు మూసి తెరిచేలోపు బంతి జట్ స్పీడ్ తో దూసుకుపోయింది. 15 ఓవర్?లో పతిరణ వేసిన బౌలింగ్?లో మిచెల్ మార్ష్, ట్రిస్టన్ స్టబ్స్?ను యార్కర్లతో ఔట్ చేశాడు. పతిరణ యార్కర్ బౌలింగ్?కు బ్యాటర్లకు ఏం అర్థం కాక ఔటైపోయారు.ఇదిలా ఉంటే.. ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు ఐదు వికెట్లకు 191 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ కు దిగిన సీఎస్కే.. 6 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో చెన్నై ఓడిపోయినా.. సీఎస్కే అభిమానులకు ఈ మ్యాచ్ చిరస్మరణీయంగా మారింది. ఎంఎస్ ధోని ఈ సీజన్‌లో తొలిసారి బ్యాటింగ్‌కు వచ్చాడు. అంతేకాకుండా.. చెన్నై బౌలింగ్ లో ఫాస్ట్ బౌలర్ మతిష పతిరానా అద్భుతంగా బౌలింగ్ చేసి ఒకే ఓవర్లో ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లను క్లీన్ బౌల్డ్ చేశాడు. పతిరనా యార్కర్ బౌలింగ్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కాగా.. సీఎస్కే తర్వాత మ్యాచ్ సన్ రైజర్స్ తో తలపడనుంది.

## రిషబ్ పంత్‌కు భారీ జరిమానా

విశాఖలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాదించిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2024లో ఇప్పటివరకు 3 మ్యాచ్‌లు ఆడిన ఢిల్లీకి ఇదే తొలి విషయం. ఐపీఎల్ 17వ సీజన్‌లో బోణి చేసిన ఢిల్లీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ కెప్టెన్ రిషబ్ పంత్‌కు భారీ జరిమానా పడింది. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ నమోదు చేసినందుకు గాను ఐపీఎల్ నిర్వాహకులు పంత్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయనందున రిషబ్ పంత్‌కు ఫైన్ వేశారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం ఢిల్లీ చేసిన తొలి తప్పిదం కాబట్టి రూ. 12 లక్షల జరిమానాతో సరిపెట్టారు. ఐపీఎల్ 2024లో ఫైన్ బారిన పడ్డ రెండో కెప్టెన్ పంత్. ఇంతకుముందు చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌కు జరిమానా విధించారు.ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం.. మొదటిసారి స్లో ఓవర్ రేటు నమోదు చేస్తే కెప్టెన్‌కు రూ. 12 లక్షల జరిమానా పడుతుంది. ఈ సీజన్‌లో ఇదే రెండోసారి రిపీట్ అయితే కెప్టెన్‌కు రూ. 24 లక్షలు ఫైన్, జట్టులోని ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో ఆరు లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తారు. ఇక మూడోసారి పునరావృతమైతే కెప్టెన్‌కు 30 లక్షల జరిమానా, ఒక మ్యాచ్ నిషేధం విధించబడుతుంది. అంతేకాకుండా ఆటగాళ్లకు రూ.12 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 50 శాతం (ఏది తక్కువైతే అది) జరిమానా విధించబడుతుంది.



## లక్నోతో తాడోపేడో తేల్చుకో నున్న బెంగళూరు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో దుండగుల పోరుకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ 2న జరగనున్న ఐపీఎల్ 15వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు తలపడనున్నాయి. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ ఆర్సీబీకి ప్రతిష్టాత్మకమైన మ్యాచ్. ఎందుకంటే గత సీజన్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ ఇదే మైదానంలో %=జదీ%పై 1 వికెట్‌తో థ్రిల్లింగ్‌తో విజయం సాధించింది. ఇప్పుడు ఈ లెక్కను చేయాలని ఆర్సీబీ జట్టు ఆశపడుతోంది. తద్వారా లక్నో సూపర్ జెయింట్స్ పై ప్రతీకారం తీర్చుకోవాలని ఎదురుచూస్తున్న ఆర్సీబీ జట్టుకు విజయం ఖాయమని చెప్పవచ్చు. ఎందుకంటే ఇరు జట్ల మధ్య జరిగే పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుదే పైచేయిగా నిలిచింది. ఇరు జట్లు ఇప్పటి వరకు 4 మ్యాచ్‌లు ఆడాయి. ఇందులో %=జదీ% జట్టు 3 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్ ఒక్కసారి మాత్రమే గెలిచింది. అది కూడా 1 వికెట్ తేడాతో ఉత్కంఠ విజయం సాధించడం ఇక్కడ ప్రస్తావించదగ్గ విషయం. అంటే లక్నో సూపర్‌జెయింట్స్‌పై అన్ని విధాలుగా %=జదీ%దే పైచేయి. అయితే లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో కేఎల్ రాహుల్, నికోలస్ పూరన్ వంటి స్టార్ ఆటగాళ్లు ఉన్నారు కాబట్టి గట్టి పోటీని ఆశించవచ్చు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో మార్పు చేయడం దాదాపు ఖాయం. ఎందుకంటే గత మూడు మ్యాచ్ ల్లో ఆడిన అల్జారీ జోసెఫ్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 3.4 ఓవర్లలో 38 పరుగులు ఇచ్చిన అల్జారీ పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చాడు. కేకేఆర్‌పై 2 ఓవర్లలో 34 పరుగులు కూడా ఇచ్చాడు. దీంతో లక్నోతో మ్యాచ్‌లో బెంగళూరు ప్లేయింగ్ 11లో కీలక మార్పులు చోటుచేకోనున్నట్లు విస్తున్నాయి. లక్నో సూపర్‌జెయింట్స్: కేఎల్ రాహుల్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్, నికోలస్ పూరన్, ఆయుష్ బదోని, కైల్ మేయర్స్, మార్కస్ స్టోయినిస్, దీపక్ హుడా, దేవదత్ పడిక్కల్, రవి బిష్ణోయ్, నవీన్-ఉల్-హక్, కృనాల్ పాండ్యా, యుధ్వీర్ సింగ్, ప్రేరక్, ప్రేరక్ ఠాకూర్, అమిత్ మిశ్రా, మార్క్ వుడ్, మయాంక్ యాదవ్, మొహ్సిన్ ఖాన్, కె. గౌతమ్. శివం మావి, అర్షిన్ కులకర్ణి, ఎం. సిద్ధార్థ్, అష్టన్ టర్నర్, అర్షద్ ఖాన్.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు: ఫాఫ్ డు ప్లెసిస్, గ్లెన్ మాక్స్‌వెల్, విరాట్ కోహ్లి, రజత్ పటీదార్, అనుజ్ రావత్, దినేష్ కార్తీక్, సుయాష్ ప్రభుదేశాయ్, విల్ జాక్స్, మహిపాల్ లొమ్రోర్, కర్ణ్ శర్మ, మనోజ్ భాండాగే, మయాంక్ దాగర్, విజయ్‌కుమార్ వైషాక్, ఆకాశ్ దీప్, మోహమ్ దీప్ , మహ్మద్ సిరాజ్, రీస్ టోప్లీ, హిమాన్షు శర్మ, రాజన్ కుమార్, కామెరాన్ గ్రీన్, అల్జారీ జోసెఫ్, యష్ దయాల్, టామ్ కరణ్, లక్కీ ఫెర్గూసన్, స్వప్నిల్ సింగ్, సౌరవ్ చౌహాన్.

## ముంబై అభిమానుల దాడి.. సీఎస్కే అభిమాని మృతి!



ఐపీఎల్ మ్యాచ్‌లో తలెత్తిన తీవ్ర వాగ్వాదం ఒక వ్యక్తి మరణానికి దారితీసింది. ఇటీవల ముంబై ఇండియన్స్ అభిమానుల దాడిలో గాయపడిన చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సీఎస్కే అభిమాని అసుపత్రిలో చికిత్స పొందుతూ.. ఆదివారం (మార్చి 31) మరణించాడు. సీఎస్కే అభిమాని మృతికి కారణమైన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మార్చి 27న ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌ను మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా హన్మంత్‌వాడికి చెందిన బందోపంత్ బాపూసో తిబిలే (63) అనే వ్యక్తి టీవీలో చూశాడు. హన్మంత్‌వాడికే చెందిన సాగర్ సదాశివ్ జంజగే (35), బల్వంత్ మహదేవ్ జంజగేతో (50) కూడా తిబిలేతో మ్యాచ్ వీక్షించారు. తిబిలే సీఎస్కేకు వీరాభిమాని కాగా.. సాగర్, బల్వంత్ ముంబై అభిమానులు. ఆ మ్యాచ్‌లో ముంబై స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ ఔటైనప్పుడు తిబిలే హేళనగా మాట్లాడి.. సంబురాలు చేసుకున్నాడు. దీంతో కోపోద్రిక్తులైన సాగర్, బల్వంత్‌లు తిబిలేపై కర్రలతో దాడి చేశారు. బాపూసో తిబిలే తలకు బలమైన గాయమై స్పృహతప్పి నేలపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన తిబిలే సమీపంలోని ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తిబిలే ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచాడు. కేసు నమోదు చేసిన కార్వీర్ పోలీసులు.. సాగర్, బల్వంత్‌లను అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఈ ఇద్దరికి రిమాండ్ విధించింది.



## ఐపీఎల్ షెడ్యూల్‌లో మార్పు!

ఐపీఎల్ 2024 పూర్తి షెడ్యూల్ విడుదలైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్ పక్కాగా ఖరారైంది. అలాగే నిర్ణీత సమయానికి మ్యాచ్‌లు జరుగుతున్నాయి. టోర్నీలో ఇప్పటివరకు మొత్తం 13 మ్యాచ్‌లు జరిగాయి. అలాగే తదుపరి మ్యాచ్‌లు కూడా నిర్ణీత సమయం ప్రకారం జరుగుతాయి. అయితే శ్రీరామనవమి పండగ సందర్భంగా ఐపీఎల్ షెడ్యూల్‌లో ఒక మార్పు జరగనుందని సమాచారం. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఏప్రిల్ 17న కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, మ్యాచ్‌ను వేరే చోటికి మార్చాలని %దీజజ×% పరిశీలిస్తోంది. దీనికి సంబంధించి ఫ్రాంచైజీలు, రాష్ట్ర క్రికెట్, ప్రసారకర్తలకు సమాచారం అందించారు. ఏప్రిల్ 17న రామ నవమి జరుపుకుంటారు. ఈ పండుగను దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. కోల్ కతాలో అట్టహాసంగా వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మ్యాచ్ కు పోలీసులు భద్రత కల్పిస్తారా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అలాగే దేశంలోని ఇతర ప్రాంతాల్లో లోక్‌సభ ఎన్నికల వాతావరణం ఉంటుంది. దీంతో మ్యాచ్‌ను వాయిదా వేయాలని బీసీసీఐ ఆలోచిస్తోంది. నివేదికల ప్రకారం, ఈ మ్యాచ్ కోసం %దీజజ× జూాదీ% అంటే అసోసియేషన్ ఆఫ్ బెంగాల్‌తో టచ్‌లో ఉంది. 17వ మ్యాచ్‌పై బీసీసీఐ త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ను రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీలకు తెలియజేస్తామని బీసీసీఐ అధికారులు చెబుతున్నారు. మ్యాచ్ తేదీ, వేదిక మార్పులపై రాష్ట్ర క్రికెట్ సంఘం, పోలీసుల నిర్ణయం తర్వాతే బీసీసీఐ ఓ అడుగు ముందుకేస్తుందని అంటున్నారు. ఐపీఎల్‌లో 70 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను బీసీసీఐ ఖరారు చేసింది. మిగిలిన ప్లేఆఫ్, ఫైనల్ మ్యాచ్ తేదీలు కూడా ప్రకటించింది. మే 21, మే 22 తేదీల్లో ప్లేఆఫ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మే 24న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. లీగ్ రౌండ్‌లో ఒక్కో జట్టు మొత్తం 14 మ్యాచ్‌లు ఆడనుండగా మే 19న లీగ్ స్టేజ్ ముగియనుంది.

## శ్రీలంక టీమ్ అరుదైన ఘనత



శ్రీలంక పురుషుల క్రికెట్ జట్టు అరుదైన రికార్డు నెలకొల్పింది. ఓ ఇన్నింగ్స్‌లో ఒక్క సెంచరీ కూడా లేకుండా.. అత్యధిక స్కోర్ చేసిన జట్టుగా నిలిచింది. ఛటోగ్రామ్‌లోని జహూర్ అహ్మద్ చౌదరి స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక ఈ రికార్డు సాధించింది. దాంతో 48 ఏళ్ల క్రితం భారత్ నెలకొల్పిన రికార్డు బద్దలైంది. 1976లో భారత్ ఇన్నింగ్స్‌లో ఒక్క సెంచరీ కూడా లేకుండా 529 పరుగులు చేయగా.. తాజాగా శ్రీలంక శతకం లేకుండా 531 పరుగులు చేసింది.బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 531 పరుగులకు ఆలౌటైంది. చివరి ఇద్దరు బ్యాటర్లు మినహా తొమ్మిది మంది రెండంకెల స్కోరు చేశారు. నిషాన్ మదుష్క (57), దిముత్ కరుణరత్నే (86), కుసాల్ మెండిస్ (93), దినేష్ చండిమాల్ (59), ధనంజయ డి సిల్వా (70), కమిందు మెండిస్ (92) అర్ధ శతకాలు సాధించారు. ఏంజెలో మ్యాథ్యూస్ (23), జయసూర్య (28), విశ్వ ఫెర్నాండో (11) రెండంకెల స్కోరు చేశారు.కాన్పూర్‌లో 1976లో న్యూజిలాండ్‌పై భారత్ 524/9 స్కోరు చేసి డిక్లేర్డ్ చేసింది. బిషన్ సింగ్ బేడీ భారత జట్టుకు నాయకత్వం వహించగా.. ఆరుగురు భారత ఆటగాళ్లు అర్ద సెంచరీలు చేసారు. ఇప్పటివరకు ఇదే రికార్డు కాగా.. తాజాగా శ్రీలంక ఆ రికార్డు బద్దలు కొట్టింది. 2009లో వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా 520/7 (డిక్లేర్డ్), 1998లో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా 517, 1981లో ఆస్ట్రేలియాపై పాకిస్తాన్ 500/8 (డిక్లేర్డ్) ఒక్క సెంచరీ లేకుండా భారీ స్కోర్లు సాధించాయి.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com